

# నేటినిజం

తెలుగు దినపత్రిక





website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 10-11-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:84 | పేజీలు:4 | వెల: రూ.1/-


## దేశంలో 45,903 కొత్త కేసులు ..

# 490 మరణాలు

### -కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ,నవంబర్9(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతూనే ఉంది. కేసుల నమోదు విషయంలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. తాజాగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం..గడిచిన 24 గంటల్లో 45,903 కొత్త కేసులు నమోదు కాగా, మొత్తం కేసుల సంఖ్య 85,53,657కి చేరింది. కాగా, రోజురోజుకూ క్రియాశీల కేసుల్లో తగ్గుముఖం కనిపిస్తోంది. మొత్తం క్రియాశీల కేసులు సంఖ్య 5,09,673 ఉండగా..ఆ రేటు ఆరు శాతానికి దిగువకు చేరి, ప్రస్తుతం 5.96 శాతంగా ఉంది. ఇదిలా ఉండగా..వైరస్ నుంచి కోలుకొని ఇంటికి చేరుతున్న వారి సంఖ్య పెరుగుతుండటం ఊరట కలిగించే అంశం. ఆదివారం రోజున 48,405 మంది కొవిడ్-19నుంచి కోలుకున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కోలుకున్నవారి శాతం 92.56 శాతంగా ఉంది. మరోవైపు, నిన్నఒక్కరోజే ఈ మహమ్మారికి 490 మంది మరణించగా..భారత్ వ్యాప్తంగా మొత్తం మరణాల సంఖ్య 1,26,611కు చేరింది. కాగా, గత 24 గంటల్లో 8,35,401 వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. నమూనా పరీక్షల విషయంలో కూడా తగ్గుదల కనిపించింది. అయితే, చలికాలం ఉద్ధృతి, దీపావళి పండుగ సమీపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. వీటిని దృష్టిలో పెట్టుకొని నిబంధనలు పాటించాలని అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

తెలంగాణలో స్వల్పంగా తగ్గుదల

తెలంగాణలో కరోనా కేసుల సంఖ్య ఆదివారంతో పోల్చుకుంటే కాస్త తగ్గింది. ఆదివారం రాత్రి 8గంటల వరకు నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల్లో కొత్తగా 857 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 2,51,183కి చేరింది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ సోమవారం ఉదయం బులిటెన్ విడుదల చేసింది. నిన్న ఒక్కరోజే కరోనాతో నలుగురు మంది మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 1,381కి చేరింది. తాజాగా 1,504 మంది కరోనా నుంచి కోలుకోగా.. ఇప్పటివరకు కోలుకున్న బాధితుల సంఖ్య 2,30,568కి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 19,239 యాక్టివ్

కేసులు ఉన్నాయని, వారిలో 16,449 మంది హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. తాజాగా జీహెచ్ఎంసీ పరిధిలో 250 కేసులు నమోదయ్యాయి.

## చిరంజీవికి కరోనా పాజిటివ్

### ట్విట్టర్ ద్వారా వెల్లడించిన మెగాస్టార్

### తెలంగాణ సిఎంవోలో కలకలం

హైదరాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ): టాలీవుడ్ ప్రముఖ నటుడు మెగాస్టార్ చిరంజీవికి కరోనా పాజిటివ్‌గా తేలింది. 'ఆచార్య' చిత్రం షూటింగ్ సందర్భంగా కరోనా టెస్ట్ చేయించుకోగా.. పాజిటివ్ వచ్చినట్లు ట్విట్టర్ వేదికగా సోమవారం నాడు చిరంజీవే స్వయంగా వెల్లడించారు. ప్రస్తుతం చిరు హోం క్వారంటైన్‌లో ఉన్నారు. మెగాస్టార్‌కు పాజిటివ్ రావడంతో తెలంగాణ సీఎంఓలో కలకలం రేగుతోంది. ఇటీవలే చిరు, నానార్జులు కలసి సిఎం కెసిఆర్‌ను కలసి పలు అంవాలపై చర్చించారు. అలగే సిఎంకు వరదబాధిత చెక్కులను అందచేశారు. ఆ సందర్భంగా చిరు మాస్కు లేకుండానే కనిపించారు. దీంతో విషయం తెలుసుకున్న సీఎంవో అధికారులు అప్రమత్తమై కరోనా పరీక్షలు చేయించుకుంటున్నారు. ఆరోజుసిఎంవోలో ఉన్న ఎంపీ సంతోష్ కరోనా పరీక్షలు చేయించుకోగా నెగిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఆదివారం నాడు ఎంపీ సంతోష్, హీరో రామ్‌చరణ్‌తో కలిసి చిరంజీవి మొక్కలు కూడా నాటారు. ఈ నెల 7న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మెగాస్టార్ చిరంజీవి, అక్కినేని నాగార్జున కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సినీ ఇండస్ట్రీ అభివృద్ధితో పాటు సినీరంగ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. అంతేకాకుండా సీఎం చేతికి చెక్‌లు కూడా అందజేశారు. ఈ సమీక్షలో ఎంపీ సంతోష్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. దీంతో వారంతా కరోనా పరీక్షలు చేయించుకున్నారు. ఇప్పటికే కొందరి ఫలితాలు రాగా.. మరికొందరి ఫలితాలు రావాల్సి ఉంది. తనకు ఎలాంటి కోవిడ్ లక్షణాలు లేవు కానీ.. వెంటనే హోం క్వారంటైన్ లో ఉన్నానని చిరంజీవి అన్నారు. గత ఐదు రోజులుగా తనను కలిసిన వారందరూ కోవిడ్ టెస్టు చేయించుకోవాల్సిందిగా కోరారు. తన ఆరోగ్యం పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తానన్నారు.

# తెలంగాణ వీర జవాన్‌కు నేతల సలాం

### ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన ర్యాడా మహేశ్‌కు నివాళి

### ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్న తెలంగాణ సర్కార్

హైదరాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ): కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో వీరమరణం పొందిన రాడ్యా మహేశ్‌కు మంత్రుఉల, జిల్లా నేతలు ఘనంగా నివాళి అర్పించారు. ఉగ్రవాదుల చొరబాటుని అడ్డుకుని నిజామాబాద్ జిల్లా కోమన్‌పల్లికి చెందిన ర్యాడా మహేశ్ అమరుడైన సంగతి తెలిసిందే. ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఐటీ మంత్రి కేటీఆర్,స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి,ఎమ్మెల్సీ కవితతదితరులు ఘన నివాళులర్పించారు. మహేశ్ త్యాగం మరువలేనిది అని పేర్కొన్నారు. మహేశ్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి కేటీఆర్ భరోసానిచ్చారు. రాడ్యా మహేశ్ మృతిపై డీజీపీ మహేందర్ రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మమ్మల్ని సురక్షితంగా ఉంచినందుకు ధన్యవాదాలు అన్నారు. మీ వీరత్వం ఎప్పటికీ మరచిపోలేమని డీజీపీ పేర్కొన్నారు. ర్యాడా మహేష్ మృతి పట్ల రాష్ట్ర శాసనసభ సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ స్పందిస్తూ.. దేశ రక్షణ కోసం సైన్యంలో చేరి భారతావని కోసం మహేష్ చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీర సైనికుడు మహేష్‌కు యావత్తు తెలంగాణ నివాళి అర్పిస్తుందన్నారు. మహేష్‌తో పాటు వీరమరణం పొందిన తోటి సైనికులకు జోహార్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు స్పీకర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీర జవాన్ల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. అమర జవాను ర్యాడా మహేశ్ కుటుంబానికి తెలంగాణ జాతి అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ట్విట్టర్ ద్వారా ఆమె స్పందిస్తూ మహేశ్‌కు ఘన నివాళి అర్పించారు. వీరోచిత పోరాటంలో దేశం కోసం తన ప్రాణాలను వదులుకున్న వీర జవాన్ కుటుంబానికి తెలంగాణ జాతి అండగా ఉందని కవిత పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లోని మాచిల్ సెక్టార్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన సైనికుడు రాడ్యా మహేశ్‌కు మంత్రి ప్రశాంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. భారతావని కోసం మహేశ్ చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు. అమర సైనికుడికి యావత్ తెలంగాణ నివాళులర్పిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం కేసీఆర్, వేల్పూర్ వాసిగా తాను మహేశ్ కుటుంబానికి అండగా ఉంటానని ప్రకటించారు. మహేశ్‌తోపాటు వీరమరణం పొందిన సైనికులకు జోహార్లు అర్పించారు. కశ్మీర్‌లో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం కోమన్‌పల్లికి చెందిన ఆర్మీ జవాన్ ర్యాడ మహేశ్(26) వీర మరణం పొందారు. మహేశ్ 2015లో ఆర్మీ జవాన్‌గా విధుల్లో చేరాడు. మహేశ్ 6వ తరగతి వరకు వేల్పూర్ మండలం కుకునూర్ ప్రభుత్వ పాఠశాలలో, 7-10వ తరగతి వరకు వేల్పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. బాల్యం నుంచి దేశభక్తి భావాలు ఉన్న మహేశ్ ప్రత్యేక ఆసక్తితో ఆర్మీలో చేరారు. మహేశ్‌కు తల్లి ర్యాడ గంగు, తండ్రి గంగమల్లు, అన్న భూమేశ్ ఉన్నారు. మహేశ్ ఏడాది క్రితం సుహాసినిని ప్రేమవివాహం చేసుకున్నాడు. ఏడాది క్రితం ఇంటికి వచ్చి నెల రోజుల పాటు ఉండి వెళ్లాడు.

# జెఎన్‌యూలో వివేకానందుడి కొత్త విగ్రహం

### 12న ఆవిష్కరించనున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,నవంబర్9(ఆర్ఎన్ఎ): జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నెలకొల్పిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 12న ఆవిష్కరించనున్నారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరణ జరుగుతుంది. ఈ విగ్రహాన్ని పూర్వ విద్యార్థుల సహకారంతో జేఎన్‌యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశాంక్ కూడా హాజరుకానున్నారు. జేఎన్‌యూ వైస్ ఛాన్సలర్ ఎం జగదీశ్ కుమార్ తన అధికారిక ట్విట్టర్ ఖాతా ద్వారా ఈ ప్రకటన చేశారు. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ.. స్వామి వివేకానంద విగ్రహాన్ని గురువారం సాయంత్రం 6:30 గంటలకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరిస్తారని ప్రకటించడం సంతోషకరంగా ఉంది. ఈ కార్యక్రమం జేఎన్‌యూ ఫేస్‌బుక్ పేజీలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుందని పేర్కొన్నారు. ఫీజుల పెంపునకు నిరసనగా గత సంవత్సరం మితవాద సంస్థలకు చెందిన వారు వివేకానంద విగ్రహం వేదికపై అభ్యంతరకరమైన సందేశాలు రాశారు. ఈ విగ్రహం వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వద్ద ఉన్నది. ఇక్కడే విద్యార్థులు హాస్టల్ ఫీజులు పెరగడాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేయడం వెనుక ఉన్న వారిపై ఫిర్యాదు చేస్తామని జగదీశ్ కుమార్ చెప్పారు.

# నేడు దుబ్బాక ఉప ఎన్నిక కౌంటింగ్

### 11గంటల కల్లా ఆ ఫలితం వెలువడే అవకాశం

### టిఆర్ఎస్‌దే ఘన విజయం అన్న ధీమాలో నేతలు

### గెలుపు తమదే అంటున్న బిజెపి, కాంగ్రెస్ పార్టీలు

హైదరాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల ఫలితం నేడు తేలనుంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దుబ్బాకలో జరిగినుప ఎన్నికలో ఓట్ల లెక్కింపు మంగళవారం చేపట్టనున్నారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఓట్ల లెక్కింపసు జరగనుంది. ఈ మేరకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. దుబ్బాక ఉప ఎన్నికల కౌంటింగ్ మంగళవారం నాడు ఉదయం సిద్దిపేట ఇందూరు ఇంజనీరింగ్ కాలేజీలో జరగనుంది. కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. మొత్తం 14 టేబుల్స్, 23 రౌండ్లలో కౌంటింగ్ పక్రియ జరగనుంది. 1453 పోస్టల్ బ్యాలెట్, 51 సర్వీస్ ఓట్లు ఉన్నాయి. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, సర్వీస్ ఓట్లు లెక్కిస్తారు. కౌంటింగ్ విధుల్లో 200 మంది సిబ్బంది పాల్గొనున్నారు. ఉప ఎన్నిక బరిలో 23 మంది అభ్యర్థులు పోటీ చేసిన విషయం విదితమే. దుబ్బాకలో మొత్తం ఓట్లు 198756 కాగా.. పోలైన ఓట్లు164192. అంటే.. 82.61 పోలింగ్ శాతం జరిగింది. దుబ్బాకలో మొత్తం 315 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ పక్రియ జరిగింది. ఇదిలా ఉంటే.. ఈ ఉప ఎన్నిక పోలింగ్‌కు సంబంధించి మూడు సంస్థలు ఇటీవలే ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలను వెల్లడించాయి. అక్కడి ఓటరు నాడిపై ఒక్కో సర్వే సంస్థ ఫలితం ఒక్కో రకంగా వచ్చింది. దుబ్బాక ఉప ఎన్నిక కోసం తాము నిర్వహించిన ఎగ్జిట్ పోల్ సర్వే ప్రకారం బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు 25వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలుస్తారని మిషన్ చాణక్య సంస్థ అంచనా వేసింది. పోలైన ఓట్లలో బీజేపీ 51.82శాతం ఓట్లు సాధిస్తుందని వివరించింది. అధికార టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాత 35.67 శాతం ఓట్లతో రెండవ స్థానంలో నిలుస్తారని, 12.15 శాతం ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మూడవ స్థానం పొందుతారని పేర్కొంది. అయితే ఆ తర్వాత మరికొన్ని సంస్థలు మాత్రం టీఆర్ఎస్‌దే పక్కాగా గెలువు అని తేల్చేశాయి. మొత్తానికి చూస్తే.. 11 గంటలకల్లా గెలుపెవరిదో తేలిపోనుంది. కాగామళ్లీ టిఆర్ఎస్ విజయదుందుభి మోగించబోతోందని ఆ పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. పోలింగ్ సరళి జరిగిన తీరుతో పాటు, ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోందంటున్నారు. ఇకపోతే పోలింగ్ ముగిసిన తరవాత విపక్ష పార్టీల నేతలు మాట్లాడిన తీరు కూడా టిఆర్ఎస్ విషయాన్ని బలపరుస్తున్నాయి. దుబ్బాకలో టిఆర్ఎస్ విజయం ఖాయమని సిఎం కెసిఆర్ ఇప్పటికే ప్రకటించారు. అలాగే మంత్రి కెటిఆర్, హరీష్ రావు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. తాజాగా దుబ్బాక ఉప ఎన్నిక పోరు ముగిసిన తరవాత వచ్చిన ఎగ్జిట్ పోల్ ఫలితాలు కూడా ఇదే విషయాన్ని బలపరుస్తున్నాయి. టిఆర్ఎస్ నుంచి సోలిపేట సుజాత పోటీ పడగా.. కాంగ్రెస్ నుంచి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి.. బీజేపీ నుంచి రఘునందన్‌రావు పోటీ చేశారు. ఈ ఎన్నిక కోసం ఈ మూడు పార్టీలు పోటాపోటీగా ప్రచారం చేశాయి. అధికార పార్టీ నేతలు ముందునుంచే గెలుపుపై ధీమాగా ఉన్నారు. కెసిఆర్ ముందు నుంచి దుబ్బాక విషయంలో భరోసాతో ఉన్నారు.

# హైదరాబాద్ అభివృద్ధికి తగ్గట్లుగా లింక్ రోడ్లు

### జూబ్లీహిల్‌లో లింక్ రోడ్డును ప్రారంభించిన కెటిఆర్

### మొత్తం 137 లింక్ రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి



హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో లింక్‌రోడ్డును ప్రారంభించిన మంత్రి కెటిఆర్. చిత్రంలో మంత్రులు తలసాని, సబితా ఇంద్రారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ): బాగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో అందుకు తగ్గట్లుగా మౌళిక వసతులను కూడా కల్పిస్తున్నామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో ఎప్పుడూ లేనంతగా హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ఆకర్షణీయమైన నగరంగా ఎదుగుతుందని తెలిపారు. జనాభా పెరుగుదల లాగానే మౌలిక వసతులను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలు తీర్చడం కోసం హైదరాబాద్ మాస్టర్ ప్లాన్స్ అన్నింటిని పరిశీలించిడం జరిగిందని మంత్రి చెప్పారు

కీలక ప్రాంతాలను కలిపే లింక్ రోడ్లు ఇంతవరకు లేవని... ఆ ప్రధాన రహదారుల ఒత్తిడి తగ్గించేందుకు లింక్ రోడ్లు దోహదపడతాయని పేర్కొన్నారు. సోమవారం మూడు రోడ్లు ప్రారంభించారు. ఇంకా 35 రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా మొత్తం 137 లింక్ రోడ్లను ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. రెండు లింక్ రోడ్లను ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. మొదటిదశలో 35 లింక్ రోడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ రోడ్ల నిర్మాణానికి రూ. 313కోట్ల 65 లక్షలు మంజూరు చేసి ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. మరో 100 లింక్ రోడ్లను అభివృద్ధి చేయబోతున్నామని స్పష్టం చేశారు. మొత్తంగా 137 లింక్ రోడ్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించారు. దశల వారీగా అందుబాటులో తీసుకోస్తామన్నారు. ఇందుకోసం రూ.313.65 కోట్లు మంజూరు చేయడం జరిగిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 నుంచి పాత ముంబై రోడ్డు లెదర్ పార్క్ వరకు నిర్మించిన లింక్ రోడ్డును కేటీఆర్ ప్రారంభించారు. వీయూసీ బ్రిడ్జి నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రుల సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మేయర్ బొంతు రామ్మోహన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి అని తెలిపారు. అత్యుత్తమ జీవన ప్రమాణాలు హైదరాబాద్‌లో ఉన్నాయని పలు సంస్థలు ఇప్పటికే వెల్లడించాయి. ఆకర్షణీయ నగరంగా రూపుదిద్దుకుంటుంది. పట్టణీకరణ కూడా వేగంగా పెరుగుతుంది. దీంతో మౌలిక వసతులు పెంచాల్సిన అవసరం ఉంది. గడిచిన 6 సంవత్సరాలు మౌలిక వసతులను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టులు చేపట్టాం అని కేటీఆర్ వెల్లడించారు. వేగంగా పెరుగుతున్న హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ క్రమంలో మిస్సింగ్ రోడ్స్, లింక్ రోడ్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నగరాన్ని ఎంత అభివృద్ధి చేసుకుంటే అంత నివాసయోగ్యంగా ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 నుంచి పాత ముంబై రోడ్డు లెదర్ పార్క్ వరకు నిర్మించిన ఈ రోడ్డును ఆరు నెలల వ్యవధిలోనే పూర్తి చేశామన్నారు. దీన్ని నెక్లెస్ రోడ్డు మాదిరి అభివృద్ధి చేయాలన్నారు. ఇదే పద్ధతుల్లో దుర్గం చెరువుతో పాటు చాలా చెరువులను జీహెచ్ఎంసీ ద్వారా అభివృద్ధి చేశామన్నారు. నగర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం ఉందన్నారు. లింక్ రోడ్ల విషయంలో ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. ఈ రహదారులను ప్రారంభించడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. జీవన ప్రమాణాలు పెంచేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ సరియైన పద్ధతులలో
మెరిసెడి చిత్రములు దీయు మేధోనిధిగా
చిరకీర్తిని "క్రిష్" చే గొన
కరయుగమును మోడ్చి భావ కాండ్రుని గన!!



-రాధశ్రీ
సెల్: 9494481210

( నవంబర్ 10 దర్శకుడు క్రిష్ జననం..)

## షాద్‌నగర్‌లో దారుణం

### ఢిల్లీలో చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య

రంగారెడ్డి,నవంబర్9(ఆర్ఎన్ఎ): జిల్లాలో దారుణం జరిగింది. డిగ్రీ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. షాద్‌నగర్ శ్రీనివాస కాలనీలో ఇంట్లో విద్యార్థిని ఐశ్వర్యా రెడ్డి ఉరి వేసుకుని బలవన్మరణం చెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీనివాస్‌రెడ్డి, సుమతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఐశ్వర్య ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని లేడీ శ్రీరామ్ కళాశాలలో బీఎస్సీ సెకండియర్ చదువుతోంది. కరోనా నేపథ్యంలో ఇటీవల ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో హాస్టల్ ఖాళీ చేయాలని సమాచారం అందింది. ఇంట్లో ఆర్థిక విషయాలపై చర్చ జరిగింది. ఆ తర్వాత ఈ నెల 3వ తేదీన ఇంట్లో ఉరి వేసుకుంది. అయితే ఆదివారం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియం లేదు. ఆర్థిక సమస్యల కారణంగా చదువు సజావుగా సాగడంలేదని... దీంతో ఐశ్వర్య ఆత్మహత్య చేసుకుందని భావిస్తున్నారు. ఐశ్వర్య మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

# రాష్ట్రపతికి 15వ ఆర్థిక సంఘం నివేదిక సమర్పణ



ఢిల్లీ, నవంబర్ 9: ఎన్‌కే సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సోమవారం తన తుది నివేదికను సమర్పించింది. 2021-22 నుండి 2025-26 వరకు ఐదు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన తుది నివేదికను సమర్పించింది.

దేశంలోని 28 రాష్ట్రాల ప్రత్యేక అవసరాలను పరిగణలోకి తీసుకుని నివేదికను రూపొందించి సమర్పించినట్లుగా ఆర్థికసంఘం పేర్కొంది. ఫైనాన్స్ కమిషన్ ఇన్ కొవిడ్ టైమ్స్ పేరుతో రాష్ట్రపతికి 4 భాగాలుగా నివేదికను సమర్పించినట్లు వెల్లడించింది.

రాష్ట్రాల ప్రాధాన్యతలను, అంశాలను రాష్ట్రాల వారీగా నివేదికలో ప్రస్తావించడంతో పాటు పన్నుల పంపకాలు, స్థానిక సంస్థలకు నిధుల విషయాలపై కీలక సూచనలు చేసినట్లుగా సమాచారం. ప్రతిభ చూపుతున్న రాష్ట్రాలకు ప్రోత్సాహకాలపై ప్రత్యేకంగా పరిశీలించాలని విన్నవించింది. అదేవిధంగా రక్షణ, అంతర్గత భద్రత నిధుల కోసం ప్రత్యేక యంత్రాంగం విషయాన్ని పరిశీలించాలంది. నివేదికను కేంద్రం పార్లమెంటులో టేబుల్ చేశాక ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది.

## బీహార్ కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

### రంగంలోకి దిగిన పారామిలిటరీ బలగాలు

పాట్నా,నవంబర్9(ఆర్ఎన్ఎ): బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడి కానున్న నేపథ్యంలో రాజధాని పాట్నా సహా పలు ప్రాంతాల్లో గట్టి భద్రత ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. 59 కంపెనీల పారామిలటరీ బలగాలను రంగంలోకి దింపారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద 19 కంపెనీల బలగాలు భద్రతలో ఉన్నాయి. బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బీహార్ సీఈసీ హెచ్‌ఆర్ శ్రీనివాస మీడియాకు తెలిపారు. కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాలను 38 నుంచి 55కు పెంచామని పేర్కొన్నారు. ప్రతి లెక్కింపు కేంద్రంలో కొవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 38 జిల్లాల వ్యాప్తంగా 55 కేంద్రాల్లో 414 హాల్స్‌ను కౌంటింగ్‌కు సిద్ధం చేశామన్నారు. ఇక ఈ ఎన్నికల్లో మహాఘటబంధన్ గెలిచే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైన విషయం తెలిసిందే. ఎన్డీయే కూటమి ఓడిపోయే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ఫలితాలు ఎలా వచ్చినా సరే.. సంయమనం పాటించాలని ఆర్జేడీ కార్యకర్తలకు ఆ పార్టీ నాయకుడు తేజస్వి యాదవ్ సూచించారు.

# భరోసా నింపిన బైడెన్ జోడి

నేటినిజం
మంగళవారం 10-11-2020

అమెరికాలో విజయఢంకా మోగించిన బిడెన్, కమలా హారిస్ జంట చేసిన ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలు కొత్త అమెరికాను ఆవిష్కరించేవిగా ఉన్నాయి. అలాగే వారి మాటల్లో అందరినీ కలుపుకుని పోవాలన్న బలమైన ఆకాంక్ష వ్యక్తం అయ్యింది. ఓట్లతో సంబంధం లేకుండా అమెరికన్లకు తాను ప్రెసిడెంట్‌ను అని బైడెన్ చేసిన ప్రకటన అమెరికన్లలో కొత్త ఆశలు చిగురించేలా ఉన్నాయి. అలాగే ప్రపంచ దేశాల పట్ల కూడా స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పే అవకాశాలు కన్పిస్తున్నాయి. మొత్తంగా విద్వేషాలకు తావులేని కొత్త అమెరికాను సృష్టించాలన్న బైడెన్ తపన ఆయన ప్రసంగంలో కనిపించింది. కలిసి పనిచేయాలని కూడా రిపబ్లికన్లకు పిలుపునివ్వడం ఆయన నిస్వార్థ రాజకీయాలకు నిదర్శనంగా చూడాలి. నిజానికి ఏ దేశమైనా ఎన్నికల వరకే రాజకీయాలు అన్న పద్ధతిలో సాగాలి. ఆ తరవాత దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు నడవాలి. అప్పుడే అభివృద్ధిలో పోటీపడగలరు. ఇప్పుడు బిడెన్, కమలాహారిస్ జోడీ అమెరికాను కొత్త శిఖరాలకు తీసుకుని పోయి, ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిస్తే అంతకు మించిన ఆదర్శం ఉండదు. ప్రస్తుతం కొనసాగుతున్న రాక్షస పాలనకు తక్షణమే అంతం పలకాలనుకుంటున్నానని ఆ దేశానికి కాబోయే అధ్యక్షుడు, డెమొక్రటిక్ పార్టీ నేత జో బైడెన్ వ్యాఖ్యానించడాన్ని అమెరికా ప్రజలు స్వాగతించారు. ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించ కుండా.. అమెరికా ఎదుర్కొంటున్న బాధాకరమైన చీకటి సమయం అంతం కావడం ప్రారంభమైందని బిడెన్ పేర్కొన్నారు. విల్మింగ్టన్‌లో అభిమానులను ఉద్దేశించి బైడెన్ విజయోత్సవ ప్రసంగం ఆశ ఆభావంగా ఉంది. విద్వేషాన్ని, విభజనను కోరుకోని, ఐక్యతను అభిలషించే అధ్యక్షుడిగా ఉండాలనుకుంటున్నట్లు చేసిన ప్రకటన అమెరికన్లలో ఆశలు నింపిందనడంలో సందేహం లేదు. ఇకపోతే కరోనా నివారణకు కూడా కార్యాచరణ చేపడతామని అన్నారు. అందుకు ఒక స్పష్టమైన కార్యాచరణను రూపొందిస్తానన్నారు. కోవిడ్ ప్లాన్‌ను రూపొందించి, అమలు చేసేందుకు శాస్త్రవేత్తలు, నిపుణులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తానని కూడా ప్రకటించారు. పూర్తి శాస్త్రీయతతో ఆ ప్రణాళిక ఉంటుందన్నారు. నిజానికి అమెరికాలో కరోనా పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఇప్పటికే 2లక్షలకు పైగా ప్రజలు కరోనాతో మృత్యువాత పడ్డారు. చైనాపై ఆగ్రహంతో ప్రకటనలు చేసిన ట్రంప్ ఆరోగ్యపరంగా గట్టి చర్యలు తీసుకోలేదు. కరోనా కట్టడిలో నిర్లక్ష్యం వహించారు. అందుకే పాలనలో భిన్నంగా వ్యవహరించనున్నట్లు ప్రకటించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న బైడెన్ గతంలో రెండుసార్లు ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం కారణంగా ఆలోచనలు కూడా అందుకు అనుగుణంగానే ఉన్నాయి. వ్యాపార రంగం నుంచి వచ్చి ట్రంప్ తన పాలనలో అనుభవ రాహిత్యం బాగా కొట్టొచ్చినట్లు కనిపించేలా చేసుకున్నారు. అందుకే బిడెన్ తనపై మీరు చూపిన విశ్వాసానికి రుణపడి ఉంటానన్నారు. నిజానికి అన్ని దేశాల్లో జరిగే ఎన్నికల ప్రచారానికి, అమెరికాలో జరిగే ఎన్నికల ప్రచారానికి చాలా తేడా వుంటుంది. వేరే దేశాల్లో అక్కడి ఆర్థిక విధానాలు, అంతర్గతంగా వుండే ఇతరేతర సమస్యలు, చాలా తక్కువ స్థాయిలో ఇరుగు పొరుగు సంబంధాలు చర్చకొస్తాయి. కానీ అమెరికాలో అంతర్గత సమస్యలతోపాటు విదేశాంగ విధానం, ప్రపంచ దేశాల తీరుతెన్నులు కూడా చర్చ నీయాంశాలే.

అది చైనా కావొచ్చు, ఇరాన్ కావొచ్చు, సిరియా కావొచ్చు... అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్న అభ్యర్థులు ఆ దేశాల్లోని పాలకులపై తమకు తోచిన తీర్పులిస్తారు. ఎవరెవరు అమెరికా ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నదీ వివరిస్తారు. తాము అధికారంలోకొస్తే ఆ దేశాలతో ఎలా వ్యవహరించ దల్చుకున్నదీ చెబుతారు. అయితే విదేశాంగ విధానంకన్నా ఈసారి అంతరంగిక సమస్యలే అమెరికా ఎన్నికల్లో ప్రధాన స్థానాన్ని ఆక్రమించాయి. ట్రంప్ ఏలుబడిలో అమెరికాను అనేక సమస్యలు చుట్టుముట్టాయి. వాటిలో ప్రధానమైనది కరోనా వైరస్ మహమ్మారి.

మొదట్లో ట్రంప్ అదొక సమస్యే కాదన్నట్లు మాట్లాడారు. వివిధ రాష్ట్రాల గవర్నర్లు అవసరానుగుణంగా ఆంక్షలు విధించి, ప్రజల స్వేచ్ఛను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. శాస్త్రవేత్తలపై కూడా ఆగ్రహావేశాలు ప్రదర్శించారు. మొత్తంగా ట్రంప్ తీరు పట్ల ప్రజల ఆగ్రహం ఇప్పుడు ఓట్ల రూపంలో వెల్లడయ్యింది. అందుకే గత అనుభవాలను పరిశీలించిన బైడెన్ అమెరికా ఘన చరిత్రను పునర్లిఖించుదాం. ప్రపంచమంతా అమెరికాను మళ్లీ గౌరవించేలా చేద్దాం అని పిలుపునిచ్చారు. మనం శత్రువులం కాదు.. ఒకే దేశస్థులం. అమెరికన్లం అని పేర్కొన్నారు. కరోనా వైరస్‌ను నియంత్రించే, సౌభాగ్య అమెరికాను పునర్నిర్మించే, మీ కుటుంబ ఆరోగ్యాన్ని పరిరక్షించే విధంగా ముందుకు సాగుతామని బిడెన్ ప్రజలకు హామీఇచ్చారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే, ప్రజలందరికీ సమన్యాయం లభించే, వ్యవస్థీకృత జాత్యహంకారాన్ని అంతం చేసే యుద్ధం చేయమని కోరుతూ నన్ను ఎన్నుకున్నారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయనని బైడెన్ దేశ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రపంచమంతా ఇప్పుడు అమెరికావైపు చూస్తోందని, ప్రపంచానికి అమెరికా దిక్సూచి అని విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షపదవికి తొలి మహిళగా చరిత్ర సృష్టించిన కమల హ్యారిస్ కూడా చాలా హుందాగా అమెరికా ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పే యత్నం చేశారు. మీరు ఆశను, ఐక్యతను, మర్యాదను, శాస్త్రీయతను, నిజాన్ని ఎన్నుకున్నారని ప్రకటించారు. అమెరికా తదుపరి అధ్యక్షుడిగా జో బైడెన్‌ను ఎన్నుకున్నారు. ఆయన గాయాలను మాన్పే శక్తి ఉన్న వ్యక్తిఅని మద్దతుదారుల హర్షధ్వానాల మధ్య వ్యాఖ్యానించారు. తాను ఉపాధ్యక్ష పదవికి ఎన్నికైన తొలి మహిళనే కావచ్చు. కానీ చివరి స్త్రీని మాత్రం కాను అంటూ మహిళల్లో భరోసా నింపారు. ఇకపోతే మొత్తంగా అమెరికన్లలో ఆశలు నింపిన ఈ జోడీ అమెరికాను కొత్త తీరాలకు తీసుకెళితే అంతకు మించిన అదృష్టం మరొకటి లేదు.

## మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### -ఘటనా స్థలంలోనే ఆరుగురు మృతి

భోపాల్,నవంబర్9(ఆర్‌ఎన్‌ఎ): మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో సోమవారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వేగంగా వచ్చిన కారు, ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఆరుగురు మృతి చెందగా, మరో వ్యక్తి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టి.. క్షతగాత్రులను రేవా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. ఓ సంతాప సభకు హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

## అదుపుతప్పి బోల్తాపడ్డ బైకు.. ఇద్దరు యువకుల మృతి

సిద్దిపేట,నవంబర్9(ఆర్‌ఎన్‌ఎ): జిల్లాలోని మద్దూరు మండలం నరసాయపల్లిలో విషాద సంఘటన చోటుచేసుకుంది. నరసాయపల్లి వెంకట్‌రెడ్డి చెరువు వద్ద ఫైబర్ నెట్ కాలువలో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మృతులను చేర్యాల మండలం పెద్దమ్మగడ్డకు చెందిన కనికరం మహేష్, జీవన్ లుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఢిల్లీలో బాణసంచా విక్రయాలు కాల్చడంపై నిషేధం



హైదరాబాద్,నవంబర్ 9: దేశ రాజధాని ఢిల్లీ అదేవిధంగా సమీప ప్రాంతాల్లో బాణసంచా విక్రయాలు, వాటిని కాల్చడంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిషేధం విధించింది. బాణసంచా విక్రయాలు, కాల్చడంపై నిషేదాజ్ఞలు ఇవాళ అర్ధరాత్రి నుంచి నవంబర్ 30వ తేదీ వరకు అమల్లో ఉండనున్నట్లు ఎన్జీటీ పేర్కొంది. ఎన్‌సీఆర్ పరిధిలోని నాలుగు రాష్ట్రాల్లో గల రెండు డజన్లకు పైగా పట్టణాలకు ఈ ఆదేశాలు వర్తించనున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీచేసింది. ఒకవైపు వాయు కాలుష్యం పెరుగుతుండటం మరోవైపు కరోనా వైరస్ కేసులు అధికమౌతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో గడిచిన 24 గంటల్లో 7,745 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

ఢిల్లీతో పాటు మరికొన్ని కాలుష్య ప్రభావ ప్రాంతాల్లోనూ ఎన్జీటీ ఆంక్షలు విధించింది. గాలి నాణ్యత మోడరేట్ ఉన్న నగరాల్లో పర్యావరణహిత క్రాకర్ల వినియోగానికి అవకాశం కల్పించింది. దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు వంటి సందర్భాల్లో 2 గంటలే బాణసంచా కాల్చేందుకు అనుమతి ఇచ్చింది. కాలుష్యం సాధారణమైన నగరాల్లో పర్యావరణహిత క్రాకర్లను వెలిగించవచ్చుంది. పర్యావరణహిత క్రాకర్లను ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటలకు వెలిగించవచ్చని పేర్కొంది.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. నలుగురు మృతి

జగిత్యాల,నవంబర్9(ఆర్‌ఎన్‌ఎ): జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. నిన్న రాత్రి ఓ కారు.. రోడ్డుపై ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. హైదరాబాద్ నుంచి మల్లాపూర్ వెళ్తున్న కారు ఆదివారం రాత్రి కోరుట్ల మండలం మోహన్‌రావుపేట వద్ద ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో ఇద్దరు మహిళలు, మరో ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతిచెందారు. కారు డ్రైవర్‌తోపాటు మరొకరు గాయపడ్డారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రలును దవాఖానకు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. మృతులు మల్లాపూర్ వాసులు రమాదేవి, లత, చిన్నారులు శిరీష, చరణ్‌గా గుర్తించామని పోలీసులు తెలిపారు.

## మరోమారు దోస్త్ కౌన్సిలింగ్ నిర్వహించాలి: టిఆర్‌ఎస్

హైదరాబాద్,నవంబర్9(ఆర్‌ఎన్‌ఎ): డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ ద్వారా మరో విడుత కౌన్సెలింగ్ నిర్వహించాని తెలంగాణ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం కోరింది. ఈ మేరకు టిఆర్‌ఎస్‌వి ఆధ్వర్యంలో ఉన్నత విద్యామండలి భవన్‌లో దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మరోమారు కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా ఈ మధ్య వెలువడిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు న్యాయం చేకూరుతుందన్నారు. ఈ విషయం పై కన్వీనర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు తౌనుపునురి శ్రీకాంత్, కాటం, శివ, సైదుల్, సురేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాణ స్వీకారానికి ముందే రంగంలోకి బైడెన్ టీమ్

### ప్రాధాన్యాంశాలను గుర్తించే పనిలో పడ్డ సభ్యులు

వాషింగ్టన్,నవంబర్9(ఆర్‌ఎన్‌ఎ): అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు నాలుగేళ్లకోమారు రెండు నెలల ముందే జరుగుతాయి. జనవరి 21న అధ్యక్షుడి ప్రమాణస్వీకారం ఉంటుంది. అంతకు ముందు అంటే నవంబర్ 3న ఎన్నికలకు జరిగాయి. ఈ ఎన్నికల్లో విజయం సొంతం చేసుకున్న డెమాక్రాట్ జో బైడెన్, కమాలాహారిస్ జోడీ అధ్యక్ష,ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికయ్యారు. జనవరి 21 వరకు ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ పాలన కొనసాగుతుంది. అయితే బైడెన్ పగ్గాలు చేపట్టకముందే తన ప్రాధాన్యాలను ప్రకటించారు.

బైడెన్ ప్రమాణ స్వీకారం ముందే పని ప్రారంభించారు. వివిధ ప్రభుత్వ ఏజెన్సీల పనితీరును సమీక్షించేం దుకు నిపుణుల బృందాలను ఏర్పాటు చేయనున్నారు. వివిధ విభాగాలకు సంబంధించిన బడ్జెట్, ఉద్యోగులు, వివాదాలు, ఇతర నిర్ణయాలను ఈ బృందాలు సమీక్షిస్తాయి. అధికార మార్పిడి సమయంలో పాలనావ్యవహారాలు కుంటుపడకుండా, సజావుగా మార్పిడి జరిగేలా చూస్తాయి. కీలక స్థానాల్లో ఉద్యోగుల బదిలీలతో పాటు, అవసరమైన చోట కొత్త ఉద్యోగుల నియామకాలను పర్యవేక్షిస్తాయి. అలాగే, ఈ విధుల పర్యవేక్షణకు 'బిల్డ్‌బ్యాక్‌బెటర్.కామ్' పేరుతో ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నారు. ఇకపోతే అగ్రరాజ్యానికి తొలి మహిళా ఉపాధ్యక్షురాలుగా తొలి నల్లజాతీయురాలు, తొలి ప్రవాస భారతీయురాలు ఎన్నిక కావడం విశేషం. మహిళా హక్కుల కోసం ఉద్యమించడమే తన లక్ష్యమని ఆమె చెబుతున్నారు.

అమెరికాలో 1913లో ఏర్పాటైన రాజకీయ సంస్థ ది నేషనల్ వుమెన్ పార్టీ తెలుపు, వంగపండు, బంగారం రంగుల్ని మహిళా ఉద్యమానికి ప్రతీకగా ఎంచుకుంది. అందులో తెలుపురంగు స్వచ్ఛతకి ప్రతిబింబంగా నిలుస్తుంది. అలా తెల్లరంగులో రాజహంసలా ఈ దేశానికి తాను తొలి మహిళా అధ్యక్షురాలిని అని, కానీ తాను చివరి మహిళని కాదు అంటూ కమలా హారిస్ ప్రకటించారు. కష్టపడే తత్వం, తల్లి చెప్పిన మాటల్ని జీవితంలో తుచ తప్పకుండా ఆచరించడం, అంతులేని ఆత్మవిశ్వాసం ఆమెని ఉపాధ్యక్ష పీఠానికి దగ్గర చేశాయి.

కమల తండ్రి డేవిడ్ హ్యారిస్ జమైకా దేశస్తుడు. తల్లి శ్యామలా గోపాలన్ భారతీయురాలు. చెన్నైకి చెందిన కేన్సర్ పరిశోధకురాలు, పౌరహక్కుల ఉద్యమకారిణి. చిన్నతనంలో తల్లిదండ్రులు విడిపోవడంతో తల్లి సంరక్షణలోనే కమల పెరిగారు. ఆమె గుణాలు పుణికిపుచ్చుకొని జాతి వివక్షపై ధిక్కార స్వరం, వలస వాదులపై ఉదారవాదం, చట్టసభల్లో ప్రశ్నించే తత్వం, అద్భుతమైన నాయకత్వ లక్షణాల్ని సొంతం చేసుకున్నారు. అమెరికా మమ్మల్ని నల్లజాతివారిగానే చూస్తుందని మా అమ్మకి బాగా తెలుసు. అందుకే నన్ను, మా చెలలెల్ని ఆత్మవిశ్వాసంతో పెంచారు. నల్లజాతీయురాలినని చెప్పుకోవడానికి నేను గర్వపడతానుఅని కమలా హ్యారిస్ తన ఆటోబయోగ్రఫీ ది ట్రూత్స్ వి హోల్డ్‌లో రాసుకున్నారు. తన సహచర లాయర్ డగ్లస్ ఎమాఫ్‌ను పెళ్లాడారు. డగ్లస్‌కు మొదటి భార్య ద్వారా ఇద్దరు పిల్లలున్నారు. వారిని సొంత పిల్లల్లా పెంచారు. న్యాయశాస్త్రంలో పట్టా తీసుకొని డిస్ట్రిక్ట్ అటార్నీగా. రాష్ట్ర అటార్నీ జనరల్‌గా తన సత్తా చాటారు. అద్భుతమైన వాక్పటిమతో మంచి లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు. 2016లో డెమొక్రాటిక్ పార్టీ తరఫున సెనెట్‌కి ఎన్నికై జాతీయ రాజకీయాల్లోకి వచ్చారు. తొలుత అమెరికాకి అధ్యక్షురాలు కావాలని కలలు కన్నారు. జో బైడెన్‌తో పోటీ పడి గత ఏడాది చివర్లో రేసు నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత కొద్ది నెలలకే బైడెన్‌కు మద్దతుగా నిలిచి ఉపాధ్యక్ష పదవిని చేజిక్కించుకున్నారు. ఒక సెనెటర్‌గా ఆమెలో నాయకత్వ లక్షణాలు ప్రపంచానికి ఎప్పుడో తెలిశాయి. ఇంటెలిజెన్స్, జ్యుడీషియరీ విభాగాల్లో మంచి పట్టున్న ఆమెకు మొదటి రోజు నుంచే ప్రభుత్వాన్ని నడిపించగల సామర్థ్యం ఉంది. మొత్తంగా ఈ ఇద్దరి జోడీ అమెరికాను కొత్త తీరాలకు చేరుస్తుందన్న నమ్మకం ఏర్పడింది.

## ట్రంప్‌కు మెలానియా విడాకులు!



హైదరాబాద్, నవంబర్ 9 : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి చవిచూసిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు కొద్ది రోజుల్లోనే మరో చేదు అనుభవం ఎదురయ్యే అవకాశం ఉంది. తన భార్య మెలానియా.. డొనాల్డ్ ట్రంప్‌కు విడాకులు ఇచ్చేందుకు సిద్ధపడినట్లు ట్రంప్ మాజీ రాజకీయ సహాయకురాలు ఒమరోసా న్యూమ్యాన్ చెప్పిన ట్టుగా డెయిలీ మెయిల్ వెల్లడించింది. అయితే ఇందు కోసం మెలానియా నిమిషాలను కౌంట్ చేస్తున్నట్లు పేర్కొంది. వైట్ హౌస్‌ను ట్రంప్ ఖాళీ చేయగానే విడాకులు ఇవ్వాలని మెలానియా నిర్ణయించుకున్నట్లు తెలిపింది. 15 సంవత్సరాల వైవాహిక జీవితానికి ముగింపు పలికేందుకు మెలానియా సిద్ధపడినట్లు న్యూమ్యాన్ చెప్పింది. అయితే గతంలో విడాకులు ఇచ్చేందుకు మెలానియా నిర్ణయం తీసుకున్నప్పటికీ.. అధ్యక్ష పదవిలో ఉన్నప్పుడు విడాకులు ఇస్తే ట్రంప్‌ను అవమానపరిచినట్టు అవుతందని భావించి, విబేధాలు ఉన్నప్పటికీ సర్దుకుపోయింది. వైట్ హౌజ్‌లో వీరిద్దరూ వేర్వేరు బెడ్ రూమ్‌లో ఉండేవారని ట్రంప్ అనుచరుడు స్టీఫెన్ ఓల్కాఫ్ వెల్లడించారు. ట్రంప్ ఓడిపోవడం మెలానియాకు కలిసొచ్చినట్టైంది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ విజయం సాధించిన విషయం తెలిసిందే. కానీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాత్రం ఇంకా ఓటమిని అంగీకరించడం లేదు. అయితే ట్రంప్ ఓటమిని అంగీకరించాలంటూ పలువురు పార్టీ ప్రముఖులు ఆయన్ను కోరినట్లు తెలుస్తోంది. ఆ జాబితాలో డోనాల్డ్ ట్రంప్ సతీమణి మెలానియా ట్రంప్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. నిజానికి అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై పబ్లిక్‌గా ఎటువంటి ప్రకటన చేయలేదు. కానీ ఆమె తన అభిప్రాయాలను వైట్‌హౌజ్ ప్రతినిధులతో వెల్లడించినట్లు తెలుస్తోంది. రెండవ సారి అధ్యక్షుడిగా పోటీ చేసిన ట్రంప్ తరపున మెలానియా ప్రచారం నిర్వహించారు. డోనాల్డ్ ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ కూడా ఓటమి గురించి ఆయనతో సంప్రదించినట్లు తెలుస్తోంది. మరో వైపు తప్పుడు పద్ధతుల్లో బైడెన్ విజేతగా ప్రకటించుకుంటున్నారని అధ్యక్షుడు ట్రంప్ ఆరోపించారు. ఫలితాలపై కోర్టులోనే తేల్చుకుంటారన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో బైడెన్ 290, ట్రంప్ 214 ఎలక్టోరల్ ఓట్లను గెలుచుకున్నారు.

# గాలిలోనూ కరోనా వైరస్ వ్యాప్తి

### గాలి,వెలుతురు విస్తారంగా ఉంటే వ్యాప్తి తక్కువే
### కాలుష్యం కూడా కారణమవుతుందన్న పరిశోధకులు
### రుజువు చేసిన సిసిఎంబి పరిశోధనలు

హైదరాబాద్,నవంబర్11(ఆర్‌ఎన్‌ఎ): గాలిలో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న జాడలున్నాయని గతంలోనే పాశ్ఆత్య దేశాల బృందం ప్రకటించింది. వారు తమ పరిశోధనలను ప్రపంచం ముందుంచారు. తాజాగా హైదరాబాద్‌కు చెందిన సిసిఎంబి కూడా ఇదే విషయాన్ని ప్రకటించింది. అయితే దాని ప్రభావం ముందుగా ఊహించినంత ప్రమాదకరంగా లేదని హైదరాబాద్‌లోని సీసీఎంబీ ప్రాథమిక పరిశోధనలో వెల్లడైంది.

గాలి వెలుతురు విస్తారంగా ఉన్న ప్రాంతంలో కూడా ప్రభావం తక్కువని గుర్తించారు. దాని ప్రభావం కేవలం రెండు నుంచి మూడు మీటర్లలోపే ఉన్నట్టు తేలింది. భయంకరమైన ఈ వైరస్ గాలిలో వ్యాపిస్తుందా? లేదా? అనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతున్నా యి. గాలిలో వైరస్ వ్యాప్తికి ఆధారాలున్నాయని వివిధ దేశాల శాస్త్రవేత్తలు, పరిశోధనా సంస్థలు.. ప్రపంచ ఆరోగ్య సంస్థ కు నివేదించాయి. ఇదే విషయంపై సీసీఎంబీ ఆధ్వర్యంలో రెండు నెలల నుంచి హైదరాబాద్ కేంద్రంగా ఎయిరోసోల్ వైరల్ ట్రాన్స్‌మిషన్‌పై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ పరిశోధనల్లో కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. నగరంలో కరోనా చికిత్సలు అందిస్తున్న కొన్ని దవాఖానలను, ఇతర ప్రాంతాలను శాస్త్రవేత్తలు పరిశోధన కోసం ఎంచుకున్నారు. కరోనా బాధితులు ఎక్కువగా, తక్కువగా ఉన్న ప్రాంతాలతోపాటు ఒకరు లేదా ఇద్దరు మాత్రమే బాధితులున్న ప్రాంతాల్లోనూ పరిశోధనచేశారు. బాధితులు అధికంగా ఉన్నచోట వైరస్ గాలిలో వ్యాపిస్తున్నట్టు గుర్తించారు. డ్రాప్‌లెట్స్ ద్వారా వెలువడిన వైరస్ గాలి, దుమ్ము కణాలలో కలిసి ప్రయాణిస్తున్నట్టు తేల్చారు.

కానీ సంబంధిత రోగులనుంచి కేవలం రెండు నుంచి మూడు మీటర్ల లోపే దాని వ్యాప్తి ఉన్నట్టు కనుగొన్నారు. వెంటిలేషన్ లేకుండా చాలావరకు 'క్లోజ్డ్ డోర్'లలో వైరస్ గాలిలో తిరగాడుతున్నట్టు గుర్తించారు. గాలి, వెలుతురు ధారాళంగా ఉన్నచోట దీని ప్రభావం తక్కువగా ఉన్నట్టు తేలింది. ఒకరిద్దరు ఉన్నచోట గాలిలో కరోనా కనిపించలేదని తెలుస్తున్నది. ఒక గదిలో 7నుంచి 10 అడుగుల ఎత్తులో వైరస్ వ్యాప్తి ఉన్నట్టు సమాచారం. ఇలాంటి ప్రాంతంలో సాధారణ వ్యక్తులకు వైరస్ వ్యాపించే అవకాశమున్నదని తేల్చారు. నలువైపులా ద్వారాలు తెరిచి వెంటిలేషన్ బాగా ఉన్నచోట గాలిలో వైరస్ జాడలు అంతలా కనిపించడం లేదని శాస్త్రవేత్తలు తమ ప్రాథమిక నివేదికలో పేర్కొన్నట్టు తెలుస్తున్నది.

ఇతర దేశా ల్లో ఆందోళన వ్యక్తమవుతున్నంత తీవ్రంగా లేదని శాస్త్రవేత్తలు నివేదించినట్టు సమాచారం. ఎయిరోసోల్ సర్వే ఇంకా కొనసాగుతున్నదని సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా చెప్పారు. ఇకపోతే కాలుష్యం కూడా ప్రభావం చూపుతోంది. కాలుష్యం కారణంగా వైరస్ ఎక్కువ వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా చెప్తున్నారు. ఢిల్లీలో కాలుష్యం వల్లే వైరస్ మరింత విజృంభిస్తున్నదని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న పకడ్బందీ చర్యల వల్ల వైరస్ కట్టడి సాధ్యమైందన్నారు. కానీ రెండో దఫా కరోనా వ్యాపించే అవకాశాలున్నాయని, ఈ దశలో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నదన్నారు. కరోనా వైరస్ వ్యాక్సిన్ కోసం దేశంలో సామాన్య ప్రజలు 2022 వరకు వేచి ఉండాల్సి ఉంటుందని కరోనా వైరస్‌పై జాతీయ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు, ఎయిమ్స్ ఢిల్లీ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా చెప్పారు. కరోనా వైరస్ వ్యాక్సిన్ భారత మార్కెట్లలో సులభంగా లభించడానికి ఆ తర్వాత ఏడాదికిపైగా పడుతుందన్నారు.

వ్యాక్సిన్ వచ్చినంత మాత్రాన కరోనా వైరస్ అంతరించిపోదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక న్యూస్ చానెల్‌కు ఇంటర్వ్యూ సందర్భంగా రణదీప్ గులేరియా మాట్లాడుతూ.. మనదేశంలో జనాభా చాలా ఎక్కువని గుర్తు చేశారు. మార్కెట్ నుంచి వ్యాక్సిన్ ఎలా కొనుగోలు చేయొచ్చో చూడడానికి తమకు సమయం కావాలన్నారు. కరోనా వైరస్ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చాక దాన్ని దేశమంతటా మారుమూల ప్రాంతాలకు కూడా చేరేలా పంపిణీ చేయడం అతిపెద్ద సవాల్ అని అభిప్రాయపడ్డారు. కోల్డ్ చైన్‌ను నిర్వహించడం, తగినన్ని సిరంజిలు, సూదులు కలిగి ఉండటం కూడా ఇందులో ఎదురయ్యే ప్రధాన సవాళ్లని పేర్కొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కొప్పుల

జగిత్యాల/కొత్తపేట, నవంబర్ 9 : గత సంవత్సరంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా మంచి వర్షాలు కురవడంతో వరి, పత్తి పంటల దిగుబడి బాగా పెరిగిందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.

జిల్లాలోని కొత్తపేటలో సోమవారం ఆయన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నీటి వనరులు పుష్కలంగా పెరగడంతో వరి,పత్తి పంటలు సమృద్ధిగా పండాయని తెలిపారు.

జిల్లాలో సుమారు 17వేల మంది రైతులు పత్తి సాగు చేయగా, 20వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు ఒక అంచనా ఉందన్నారు.

చుట్టుపక్కల ఉన్న అన్ని మండలాల రైతులకు అందుబాటులో ఉండేవిధంగా ఈ కొనుగోలు కేంద్రాన్ని కొత్తపేటలో ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. పత్తి రంగు మారకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ, ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా మంత్రి రైతులను కోరారు.



## యాదాద్రిని గుడుంబా రహితంగా మార్చాలి

### -అధికారులతో సమీక్షలో మంత్రి శ్రీనివాసగౌడ్ ఆదేశాలు

యాదాద్రి భువనగిరి,నవంబర్9(ఆర్‌ఎన్‌ఎ): ఆధ్యాత్మిక కేంద్రంగా కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న యాదాద్రి జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా మార్చాలని ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అధికారులకు సూచించారు. ప్రపంచంలోనే అద్భు క్షేత్రంగా తయారైన యాదాద్రిలో గుడుంబా లేకుండా చేయాలన్నారు. స్థానిక ఆర్‌అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా కొనసాగించేందుకు మద్యం అక్రమ రవాణా, కల్తీ మద్యాన్ని పూర్తిగా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.గంజాయి రవాణా జిల్లాలో పూర్తిగా నిర్మూలించేందుకు రైళ్లలో అక్రమ రవాణపై నిఘా ఉంచాలన్నారు. మద్యం షాపుల వద్ద కరోనా నిబంధనలను పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణకు హరితహారం కింద తాటి, ఈత వనాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరా పాలసీ కింద తాటి చెట్లను, తాటి ఉత్పత్తులను పూర్తిస్థాయిలో ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గీత కార్మికులకు 50 సొసైటీలకు అందించిన భూమిని తాటి, ఈత వనాలను మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కల్తీ మద్యం కేసును పట్టుకున్న భువనగిరి సీఐ నాగిరెడ్డిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, అడిషనల్ కలెక్టర్ కీమ్యా నాయక్ ఎక్సైజ్ అధికారులు విష్ణు ప్రియ, డిప్యూటీ కమిషనర్ నల్గొండ అంజలి రావు పాల్గొన్నారు.

## సిద్దిపేట కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు

### -ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ భారతి హోళికేరి

సిద్దిపేట,నవంబర్9(ఆర్‌ఎన్‌ఎ): సిద్దిపేట ఇందూరు కాలేజీలో దుబ్బాక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం కౌంటింగ్ జరుగనుండడంతో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిరు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి చెన్నయ్య, జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి, సీపీ జోయల్ డేవిస్‌లు కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. కౌంటింగ్ దగ్గర పడుతున్న కొద్దీ దుబ్బాక ఉప ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ప్రజా తీర్పు ఎలా ఉండబోతోందని ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే దుబ్బాక ఉప ఎన్నిక కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లును అధికారులు పూర్తిచేశారు

10వ తేదీ ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలు కాగా, మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ఆ తర్వాత 8.30 నుంచి ఈవీఎంలు లెక్కింపు మొదలుకానుంది. ఈ ప్రక్రియలో14 టేబుల్స్ ఏర్పాటు చేసి 14 రౌండ్లలో అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ ప్రారంభించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో రికార్డ్ చేస్తూ లెక్కింపు చేపట్టనున్నారు. సిద్దిపేట జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంది. పాసులు ఉన్నవారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రం ఇందూర్ కాలేజి వరకు అనుమతి ఇస్తున్నారు. కోవిడ్ నేపథ్యంలో 14 టేబుళ్ల మధ్య 6 అడుగల భౌతిక దూరం ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

# వ్యాక్సిన్ అంటేనే జీవితకాల వ్యాధినిరోధకత..!

**(10 నవంబర్ "ప్రపంచ వ్యాధినిరోధకత దినం" సందర్భంగా)**

కరోనా వైరస్ కల్లోలంతో ప్రపంచ మానవాళి ప్రాణభయంతో సామాజిక క్రమశిక్షణ పాటిస్తూ, వ్యాక్సిన్ కోసం వేయికళ్ళతో ఎదురుచూస్తున్నది. చికిత్స లేని భయంకర కోవిడ్–19కు టీకాలే అంతిమ పరిష్కారమని వైద్య నిపుణులు ప్రకటిస్తున్నారు. అనేక ప్రాణాంతక రోగాలకు టీకాలు అందుబాటులో ఉన్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకోవద్దు. వ్యాధి రాక పూర్వమే వ్యాక్సిన్‌తో అడ్డుకోవడానికి ప్రతిభ బూనాలి. ఇన్ని ప్రయత్నాలు జరిగినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా 2 –3 మిలియన్ల పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను ఇప్పించని కారణంగా అకాల మరణం చెందడం విచారకరం. వ్యక్తి జీవితకాలంలో పలు సంక్రమణ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలతో నిరోధించడానికి అందుబాటులో ఉన్న వైద్య సదుపాయమే వ్యాక్సినేషన్ ప్రక్రియ. ఇప్పటికీ విశ్వవ్యాప్తంగా 18.7 మిలియన్ల శిశువులు టీకాలకు దూరంగా ఉంటూ, సులభంగా భయంకర మహమ్మారుల విష వలయంలో చిక్కుకోవడం జరుగుతున్నది. అధిక జనాభా, పేదరికం, నిరక్షరాస్యత వంటి దీర్ఘకాలిక సమస్యలతో సతమతమవుతున్న భారతంలో అందరికీ టీకాలు అందించాలనే సదుద్దేశంతో ప్రవేశ పెట్టిన ప్రతిష్ఠాత్మక 'సార్వత్రిక వ్యాధినిరోధకత కార్యక్రమం (యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్)' గత 3 దశాబ్దాలుగా అందుబాటులో ఉన్నప్పటికీ, దేశంలోని 65 శాతం పిల్లలకు మాత్రమే మె?దటి సంవత్సరంలో రక్షణ కల్పిస్తున్నది. భారత శిశువులు అందరికి నూటికి నూరు శాతం వ్యాక్సినేషన్ వసతులు కల్పించాలనే భారీ లక్ష్యంతో కేంద్ర ఆరోగ్యశాఖ 2014లో 'మిషన్ ఇంద్రధనుష్' కార్యక్రమాన్ని కూడా చేపట్టి, మాతాశిశు సంపూర్ణ ఆరోగ్యానికి పునాదులు వేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ప్రపంచ శిశువుల్లో 33 శాతానికి పైగా టీకాలు వేయించని పిల్లలు ఇండియాలో ఉన్నారనే వాస్తవం దేశ అనారోగ్య స్థితిని తెలియజేస్తున్నది. విశ్వ మానవాళికి వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రాధాన్యతను వివరించేందుకు, నిరోధించగల భయంకర వ్యాధుల నుంచి జీవితకాల రక్షణ పొందేందుకు కావలసిన అవగాహన కల్పించేందుకు ప్రతి యేటా 10 నవంబర్ రోజున 'ప్రపంచ వ్యాధినిరోధకత దినం (వరల్డ్ ఇమ్యునైజేషన్ డే)' పాటించడం జరుగుతున్నది. జీవ ప్రక్రియ ద్వారా తయారు చేయబడి, ఒక ప్రత్యేక వ్యాధిని జీవితకాలం నిరోధించడానికి ఇవ్వబడే ఔషధాన్ని టీకా లేదా వ్యాక్సిన్ పిలుస్తారు. టీకాలు వేయించడంతో వ్యక్తి శరీరంలో రోగనిరోధక శక్తి జీవితకాలం బలపడుతుంది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా మరియు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా అందుబాటులో ఉండే టీకాలను సకాలంలో క్రమం తప్పకుండా శిశువులకు ఇప్పించాల్సిన కనీస బాధ్యత తల్లితండ్రుల మీద అధికంగా ఉన్నది. ఎలాంటి దుష్ప్రభావం లేని టీకాలను వైద్యుల సలహాలతో మాత్రమే ఇప్పించడం శ్రేయస్కరం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం 25 రకాల సంక్రమణ వ్యాధులను నిరోధించడానికి 240 రకాల టీకాలు ఉన్నాయి. 1802లో 3-ఏళ్ల భారత బాలిక ప్రప్రథమంగా మశూచి టీకాను తీసుకొన చరిత్ర సృష్టించింది. గత ఆరు దశాబ్దాలుగా టీకాల సహాయంతో మశూచి వ్యాధిని అరికట్టగలగడం ఒక వైద్యరంగ ఘనవిజయంగా చెప్పవచ్చు. అతి భయంకరమైన పోలియో వ్యాధిని సమూలంగా అరికట్టేందుకు మరియు 'పోలియోరహిత భారత్'గా 2014లో ప్రకటించేందుకు పోలియో టీకాలు అందరికి అందుబాటులో ఉండటమే కారణం. డిఫ్తీరియా, మాసిల్స్, టిబి, పోలియో, రోటావైరస్, హెపటైటిస్ ఏ/బి, కలరా, మంప్స్, ర్యాబిస్, రుబెల్లా, మశూచి, టెటనస్, టైఫాయిడ్, ఎల్లో ఫివర్, డయేరియా, న్యుమోనియా లాంటి అనేక వ్యాధులకు సరైన చవకైన టీకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా యూనిసెఫ్ గుర్తించిన ప్రమాదకర వ్యాధుల్లో మిసిల్స్, పోలియో, డిఫ్తీరియా, వూఫింగ్ కాఫ్, డెంగ్యూ, టిబి, టెటనస్‌లకు టీకాలతోనే చరమగీతం పాడవచ్చు. శిశువుకు పూర్తి వ్యాధినిరోధకత సురక్షను కలిగించడానికి ఒక డోస్ బిసిజి, మూడు దోసుల పిసివి, పోలియో చుక్కలు, రెండు డోసుల రోటా వైరస్ మరియు ఒక డోసు మిసిల్స్ టీకాలను నిర్ధేశించిన వయస్సుల్లో ఇప్పించాలి. నేటికీ కరోనా, హెచ్ఐవి/ఏయిడ్స్, హంటింగ్టన్ వ్యాధి, హైడ్రోసిఫలస్‌ల వంటి కొన్ని భయంకర వ్యాధులకు టీకాలు అందుబాటులో లేకపోవడం విచారకరం. సార్వత్రిక వ్యాక్సినేషన్‌లో వైఫల్యాలకు కారణాలుగా ప్రభుత్వ బలహీన ఆర్థిక స్థితి, ప్రజల్లో అవగాహనా లేమి, నిరక్షరాస్యత, అధిక జనాభా, వ్యాక్సిన్ కొరత లాంటి అవరోధాలను చెప్పవచ్చు. ప్రతి వ్యాక్సిన్‌కు కాలపరిమితి (ఎక్సపైరీ) ఉండడంతో సకాలం అందక పోవడంతో టీకా మందులు వృధా అయిపోతున్నాయి. అందుబాటులో ఉన్న టీకాలను పిల్లలకు సకాలంలో ఇప్పించే ఆరోగ్య యజ్ఞంలో తల్లితండ్రులు, పౌర సమాజం, స్వచ్ఛంధ సంస్థలు, ప్రభుత్వాలు తమ తమ కర్తవ్యాలను నిర్వహించాలి. వ్యాక్సిన్ అందుబాటులో లేని కరోనా, హెచ్ఐవి లాంటి వైరస్‌లకు త్వరగా పరిశోధనా ఫలితాలతో పరిష్కారాలు రావాలని ఎదురు చూస్తూ, అవి సంక్రమించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంట, వ్యాధి సోకక ముందే నివారించుకునే ప్రయత్నాలు చేద్దాం.



– డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# తాడికొండలో ముదురుతున్న రాజకీయ వివాదం.. అసలేం జరుగుతోంది..?

గుంటూరు,నవంబర్9(ఆర్ఎన్ఎ): తాడికొండలో రాజకీయ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. వైసీపీ ఎమ్మెల్యే శ్రీదేవి మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. కొన్ని రోజుల క్రితం గుంటూరు పేకాట క్లబ్ వ్యవహారం ఏపీలో సంచలనమైన విషయం విదితమే. ఈ విషయంపై ఇప్పటికే శ్రీదేవి స్పందించి.. పేకాట క్లబ్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని.. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని క్లారిటీ కూడా ఇచ్చుకున్నారు. అప్పట్లో ఈ విషయమై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని కూడా ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే తాజాగా ఈ వ్యవహారం మరోసారి హాట్ టాపిక్ అయ్యింది. పేకాట వ్యవహారంపై వైసీపీ బహిష్కృత నేత శృంగారపాటి సందీప్ తాజాగా మరో ఆడియోను విడుదల చేశాడు. ఆడియోలో ఏముంది..!?ఇందులో పేకాట ఆడిద్దామని సందీప్‌తో జరిపిన ఫోన్ సంభాషణ ఉంది. టీడీపీలో ప్రత్తిపాటి పుల్లారావు, మోదుగుల క్లబ్‌లు నడిపించారని.. మనం కూడా పేకాట ఆడిద్దామని సందీప్‌తో శ్రీదేవి చెప్పినట్లుగా ఆడియోలో ఉంది. అంతేకాదు.. ఫిరంగిపురం మండలంలో ఆడిద్దామని శివరామిరెడ్డి చెబుతున్నారని.. 5 శాతం ఇస్తామని చెబుతున్నారని కూడా అందులో ఉంది. చాలా డబ్బులు వస్తాయని శివరామిరెడ్డి చెబుతున్నాడని.. ఏం చేయాలో చూడాలని సందీప్‌తో ఎమ్మెల్యే శ్రీదేవి చర్చించినట్లు స్పష్టంగా ఉంది. ప్రస్తుతం శ్రీదేవి ఆడియో వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది.నాకు ప్రాణహానీ ఉంది.. ఎమ్మెల్యే ఫిర్యాదు..ఈ ఘటనకు ముందు తాడికొండ పీఎస్‌లో నలుగురిపై ఎమ్మెల్యే శ్రీదేవి ఫిర్యాదు చేశారు. తన మాజీ అనుచరుల నుంచి ప్రాణహాని ఉందంటూ శ్రీదేవి ఫిర్యాదులో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రాజకీయాల్లో తాను ఎదుగుతుంటే చూడలేక ఇలా రాళ్లు వేస్తున్నారని.. అంతేకాదు తన వెంట మారణయుధాలతో తిరుగుతున్నారని శ్రీదేవి సంచలన ఆరోపణలు చేశారు. అంతటితో ఆగని ఆమె.. తన గొంతును మార్ఫింగ్ చేసి ఇలా ఆడియోలు విడుదల చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.నాకూ ప్రాణహానీ ఉంది..!అయితే ఈ మొత్తం వ్యవహారంపై తాడికొండ సందీప్ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. ఎమ్మెల్యే శ్రీదేవి కేసు పెట్టడంపై సందీప్ ఆవేదన వ్యక్తం చేశాడు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డే తనను కాపాడాలని వీడియోలో వేడుకున్నాడు. నాపై అక్రమ కేసులు పెట్టడంతో అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. నా భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ఏడుస్తున్నారు. నాకు చావు తప్ప మరో మార్గం కనిపించటం లేదు. సీఐ ధర్మేంద్ర, ఎమ్మెల్యే శ్రీదేవి వల్ల నాకు ప్రాణహాని ఉంది. శ్రీదేవికి కష్టకాలంలో అండగా ఉన్నానని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని ఆమె కంటతడి పెట్టుకుంటే.. తనకు తెలిసినవాళ్ల దగ్గర నేను మధ్యవర్తిగా ఉండి డబ్బులు ఇప్పించానని.. ఇప్పుడు ఆ డబ్బులు అడుగుతుంటే..ఇవ్వకుండా తనపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారు అని వీడియోలో సందీప్ వెల్లడించాడు.గతంలో శ్రీదేవి ఏమన్నారు..!?పేకాట క్లబ్‌కు నాకు ఎలాంటి సంబంధం లేదు. నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పేకాట జరుగుతున్న నంబూరు గ్రామం నా నియోజకవర్గం కాదు. పక్క నియోజకవర్గంలో పేకాట జరిగితే తాడికొండ నియోజకవర్గానికి ఏం సంబంధం..?. మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. నేను ఏ పోలీసులకు పేకాట విషయంలో ఫోన్ చేయలేదు. నాపై జరుగుతున్న కుట్ర గురించి డీజీపీకి ఫిర్యాదు చేస్తాను. పూర్తి విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూస్తాయి. మీడియా కూడా నాపై తప్పుడు కథనాలు వేస్తే పరువు నష్టం దావా వేస్తాను. మహిళా నేతను అణిచివేసే ధోరణి కాకుండా నిజాలు, ప్రజలకు చేరవేయాలి అని గతంలో ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే శ్రీదేవి స్పందించారు.ఏం తేలుస్తారో..!?మొత్తానికి చూస్తే తాడికొండ వైసీపీలో నెలకొన్న వివాదాలకు ఇప్పట్లో ఫుల్ స్టాప్ పడే అవకాశాలు మాత్రం కనిపించట్లేదు. అసలు తాడికొండలో అసలేం జరుగుతోందో తెలియని పరిస్థితి. అటు ఎమ్మెల్యే ఏమో తన మాజీ అనుచరుల నుంచి ప్రాణహానీ ఉందని చెప్పడం.. ఇటు మాజీలు కూడా ఎమ్మెల్యే నుంచి ప్రాణహానీ ఉందని మీడియా ముందుకొచ్చి.. మరోవైపు సెల్ఫీ వీడియోలు, ఆడియోలు రిలీజ్ చేసి మరీ చెప్పడంతో ఎవరి మాటల్లో నిజముందే తెలియని పరిస్థితి నెలకొంది. ఇలాంటి తరుణంలో ఎమ్మెల్యే నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఎలా ముందుకెళ్తారో.. కేసులో ఏం తేలుస్తారో వేచి చూడాలి.

# ఏపిలో తగ్గుతున్న కేసులు

**–కైకలూరు ఎమ్మెల్యేకు కరోనా పాజిటివ్**

అమరావతి,నవంబర్9(ఆర్ఎన్ఎ): ఏపీలో కరోనా ఉధృతి కొనసాగుతోంది. గత రెండు రోజులుగా కరోనా కేసులు తగ్గుముఖం పడుతున్నా ఉధృతి తగ్గిందని చెప్పలేం. తాజాగా నమోదయిన కేసులతో కరోనా కేసులు 84.29 లక్షలు దాటిపోయాయి. సామాన్యుల నుంచి రాజకీయ నాయకుల వరకు ఎవర్ని కరోనా వదలడం లేదు. రాష్ట్రంలో ఇప్పటికే అనేకమంది రాజకీయ నాయకులు కరోనా బారిన పడిన సంగతి తెలిసిందే. తాజాగా వైసీపీ కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వర్ రావు కరోనా బారిన పడ్డారు. గత కొద్ది రోజులుగా ఆయనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కరోనా టెస్ట్ చేయించుకున్నారు. ఈ పరీక్షల్లో కరోనా పాజిటివ్ గా నిర్ధారణ జరిగింది. కరోనా పాజిటివ్ గా నిర్ధారణ కావడంతో అయన హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత కొద్ది రోజులుగా తనను కలిసిన వ్యక్తులు టెస్ట్ చేయించుకోవాలని నాగేశ్వరరావు కోరారు.

# నిజాయితీగా పనిచేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలి జిల్లా ఎస్పీ

**ప్రజల ఫిర్యాదుల పట్ల బాధ్యతాయుతముగా వ్యవహరించాలి జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే**

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 9 (నేటినిజం ప్రతినిధి):నిజాయితీగా పనిచేసిప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని ,సిబ్బంది అధికారుల వారి యొక్క ఉత్తమ పనితీరును పట్టి ప్రతి నెల రివార్డులను అందజేస్తామనిరాజన్న సిరిసిల్ల ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు సోమవారం జిల్లాలోని తడూర్ నందు గలా ఏ.ఆర్ హెడ్ క్వార్టర్స్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పిర్యాదుల స్వీకారణ కానిస్టేబుల్ అధికారులకు ఒక రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతు రిసెప్షన్ వర్టికల్ సిబ్బందికి ఒకరోజు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపినారు.ప్రజల ఫిర్యాదుల పట్ల పోలీసులు బాధ్యతాయుతముగా వ్యవహరించి, చట్ట పరనీగా తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని, ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను నేరుగా స్వీకరించాలి, దరఖాస్తు స్వీకరించేటప్పుడు ప్రతి దరఖాస్తులో నేరము జరిగిన తీరును గురించి ఎక్కడ, ఎప్పుడు, ఎందుకు, ఎలాజరిగింది, ఎందుకోసము జరిగినది. అనే విషయాలను ఖచ్చితంగా ఉండేటట్లు చూడవలసిన బాధ్యత రిసెప్షనిస్ట్ దేనని తెలిపారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన పిర్యాదిదారులని చూసి వారి సమస్యలు అడిగి తెలుసుకుని వారి సమస్య తీరుతుందని వారికీ భరోసా కల్పించి వారితో మాట్లాడి వారికి వీలైనంత తొందరగా న్యాయం చేయాలని సూచించారు. రిసెప్షన్ఈస్ట్ గా ప్రతి దరఖాస్తు పై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో జనరేట్ చేసినా రిసిప్ట్ ఇవ్వాలని సూచించారు, మరియు వెంటనే సి.సి.టి.యన్.యస్ ప్రాజెక్టు ద్వారా పిటిషన్ మేనేజ్మెంట్ లో ఆన్ లైన్ ఎంటర్ చేయలని పిటిషన్ మరియు ఎంక్వయిరీ రిపోర్ట్ స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. క్రమశిక్షణ సమయపాలన వృత్తిపట్ల నిబద్ధత విధేయత కలిగి ఉండవలెను మరియు నీట్ యూనిఫాంలో ఎల్లప్పుడూ చురుకుగా ఉండాలన్నారు. బాధ్యతలు నిర్వహించడంలో నిజాయితీ పారదర్శకత జవాబుదారిగా ఉండాలన్నారు. రిసెప్షన్ వద్ద మరియు పరిసర ప్రాంతాల్లో 5 ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా సిస్టం, ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. పోలీస్ ఉద్యోగిగా ప్రజల సమస్యలను తీర్చగలిగే అవకాశం రావటం అదృష్టంగా భావించాలని అన్నారు, చట్టపరిధిలో విధి నిర్వహణ, మానవీయ కోణంలో ఆదరణ వంటి లక్షణాలు పోలీసు ఉద్యోగిని అత్యున్నత స్థాయిలో నిలబెడుతుందని అభివర్ణించారు. పోలీసు ఉద్యోగం అంటే అధికారం అని కాకుండా బాధ్యతని తెలుసుకుని డ్యూటీ చేయాలని తెలిపారు, ప్రవితమైన యునిఫాం యొక్క విలువను కాపాడాల్సిన బాధ్యత మన పైన వున్నదని తెలిపారు. చిన్న చిన్న మార్పులతో మనం మారుతూ వుంటే ప్రజలకు మన పైన మంచి అభిప్రాయం వస్తుంది అని తెలిపారు. మన పరిధిలో కాకుండా వేరే పరిధిలో నేరం జరిగినట్లు దరఖాస్తు వస్తే ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే దరఖాస్తు తీసుకుని రసీదు ఇవ్వాలి సూచించారు. అపరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ కు దరఖాస్తును బదలీ చేయలని సూచించారు. దీనివల్ల ప్రజలకు పోలీసు వ్యవస్థ పై మంచి అభిప్రాయం కలుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టౌన్ సి.ఐ వెంకటనర్సయ్య రిసెప్షన్ వర్టికల్ సిబ్బంది పాల్గొన్నారు.



# యాదాద్రి గండి చెరువుకు మహర్దశ

**ఆలయ కార్యక్రమాలకు అనువుగా అభివృద్ధి**
**శంషాబాద్ నుంచి నేరుగా బస్ సర్వీసులు నడిపే యోచన**

యాదాద్రి,నవంబర్9(ఆర్ఎన్ఎ): యాదాద్రి అభివృద్ధి కారణంగా పుణ్యక్షేత్రానికి చేరువలో ఉన్న గండి ఃచెరువుకు మహర్దశ పట్టనుంది. దీనిని పూర్తిస్థాయిలో అద్భుతమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ది చేయనున్నారు. సిఎం కెసిఆర్ కూడా దీనిని అద్భుతమైన ల్యాండ్‌స్కేపింగ్, వాటర్ ఫౌంటెన్లతో తీర్చిదిద్దాలని సూచించారు. బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవాలు తదితర కార్యక్రమాలను నిర్వహించు కొనేందుకు వీలుగా సుందరీకరణ పనులు ఉండాలని ఆదేశించారు. ఇక్కడ పంచనారసింహ మూర్తులను ప్రతిష్ఠించాలని సూచించారు. ఇకపోతే ఇక్కడ బోటింగ్ తదితర సౌకర్యాలు ఉండేలా చూస్తున్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌కు ఈ పుణ్యక్షేత్రం చేరువగా ఉన్నందున శంషాబాద్ నుంచి భవిష్యత్‌లో నేరుగా బస్సులు, ప్రత్యేక సర్వీసులు నడిపే ఆలచన చేస్తున్నారు. వివిధ దేశాల నుంచి వచ్చే భక్తులు లేదా ఎన్నారైలు నేరుగా వచ్చి దర్శించుకునేలా ఏర్పాట్‌ఉల చేయనున్నారు. వారికి అందుబాటు లో కాటేజీలు, సైక్యాలు కల్పించనున్నారు. యాదాద్రి టెంపుల్‌సిటీలో 250 డోనర్ కాటేజీలను నిర్మించ నున్నారు. ప్రతియాభై కాటేజీలకు ఒక ప్రత్యేక డిజైన్‌ను రూపొందించి.. వాటికి భక్తప్రహ్లాద, అమ్మవార్ల పేర్లు పెట్టుకోవాలని సిఎం కెసిఆర్ సూచించారు. కుటుంబం తోసహా దర్శనానికి వచ్చే భక్తులకు ప్రశాంతత కల్పించేలా, యాదాద్రి పుణ్యక్షేత్ర పునర్దర్శనంపై భక్తులకు ఆసక్తిపెరిగేలా విశాలమైన స్థలాల్లో వాటిని నిర్మించాలని సూచించారు. వేలమంది హాజరైనా సౌకర్యంగా ఉండేలా కల్యాణ మండపాల నిర్మించాలని అన్నారు. పుణ్యక్షేత్ర ప్రాంగణంలో ఆధ్యాత్మిక ప్రసంగాలు.. స్వాములతో ప్రవచనాలను ఆలకించేందుకు లక్షలమంది కూర్చునేలా తొంభై ఎకరాల్లో భక్తి ప్రాంగణాన్ని నిర్మించబోతున్నారు. ఇకపోతే దేవాలయ విమానగోపురాన్ని బంగారు తాపడంతో తీర్చిదిద్దబోతున్నారు. ఆలయ నిర్మాణాలన్నీ మూడునెలల్లో పూర్తిచేసి ప్రారంభించుకునేలా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఇటీవలే ఆదేశించారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరమైన ఆర్థికవనరులను అందజేస్తున్నదని.. ఆ మేరకు అధికారులు పనుల్లో వేగంపెంచాల్సిన అవసరమున్నదని పేర్కొన్నారు. ఆలయ పరిసరాలన్నింటా భక్తిభావం, ప్రశాంతత పరిఢవిల్లేలా తీర్చిదిద్దాలని సూచించారు. అయోధ్య, అక్షరధామ్ పుణ్యక్షేత్రాలకు మెరుగులద్దిన శిల్పులతో యాదాద్రి ఆలయానికి తుదిమెరుగులు దిద్దాలని ఆదేశించారు. ఆలయప్రాంగణంతోపాటు టెంపుల్‌సిటీ, కాటేజీలు, బస్టాండ్ తదితర నిర్మాణాల పురోగతిపై చర్చించారు. యాదాద్రి చుట్టుపక్కల ప్రాంతాల సుందరీకరణ, ల్యాండ్‌స్కేపింగ్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు. గుట్టమీదకు బస్సులు వెళ్లే మార్గాలు, వీఐపీ కార్ పార్కింగ్, కల్యాణకట్ట, పుష్కరిణిఘాట్, బ్రహ్మోత్సవ, కల్యాణమండపాల నిర్మాణాలపై ఆరాతీశారు. హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో ఉన్నందున యాదాద్రి పుణ్యక్షేత్రానికి ప్రాధాన్యం మరింతగా పెరుగుతుందని, దేశ విదేశాల నుంచి రాజధానికి వచ్చే టూరిస్టులు దర్శించుకునే అవకాశాలుంటాయని కేసీఆర్ తెలిపారు. యాదాద్రి ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి సాటిచెప్పేలా ప్రభుత్వం కృషిచేస్తున్నదని, నిర్మాణ పనులు చివరి అంకానికి చేరుకున్న నేపథ్యంలో ఆలయపరిసరాలు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండాలని అన్నారు. ఎక్కడ ఖాళీ జాగా కనిపించినా పెద్దపెద్ద చెట్లతో భవిష్యత్‌లో పచ్చదనం శోభిల్లేలా మొక్కలను నాటాలని.. వేప, రావి, సిల్వర్ వోక్ తదితర ఎత్తుగా పెరిగే చెట్లను పెంచాలని సూచించారు. ప్రస్తుతం యాదాద్రి బస్టాండ్ స్థలాన్ని దేవాలయ నిర్మాణ అవసరాలకు వినియోగించు కుంటున్న నేపథ్యంలో.. దానికి ప్రత్యామ్నాయంగా గుట్ట సమీపంలో ఏడెకరాల స్థలాన్ని కేటాయిస్తున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆలయ నియమాలను అనుసరించి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా బస్టాండ్‌ను నిర్మించుకోవాలని సూచించారు. ఆర్అండ్‌బీ మంత్రిత్వశాఖతో సమన్వయం చేసుకుని పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. 11 ఎకరాల స్థలంలో మూడువేలకుపైగా కార్లు పట్టేలా పార్కింగ్ ఏర్పాటుచేయాలన్నారు. సౌత్ఇండియన్ వంటకాలతోపాటు నార్త్ఇండియన్, అంతర్జాతీయ కాంటినెంటల్ భక్తుల కోసం శాఖాహారం అందించే ఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు.

# సమీపిస్తున్న తుంగభద్ర పుష్కరాలు

**ఇరు రాష్ట్రాల్లో ఘనంగా ఏర్పాట్లు**
**ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న అధికారులు**

జోగులాంబ గద్వాల,నవంబర్9 (ఆర్ఎన్ఎ): పుష్కరం అంటే పన్నెండు..పన్నెండేళ్లకో మారు వచ్చేవే పుష్కరాలు. మనకు ప్రధానంగా కృష్ణ,గోదావరి పుష్కరాలతో పాటు తుంగభద్ర పుష్కరాలు కూడా వస్తుంటాయి. ఈ నెల 20నుంచి తుగంభద్ర పుష్కరాలు రానున్నాయి. గంగానదిలో స్నానం చేస్తే ఎంత పుణ్యం వస్తుందో తుంగభద్ర జలాలు తాగితే అంతే పుణ్యం వస్తుందని దీని అర్థం. అత్యంత ప్రాశస్త్యమున్న తుంగభద్ర నదీ పుష్కరాలకు సమయం ఆసన్నమైనది. ప్రతి 12ఏండ్లకు ఒకసారి తుంగభద్ర నదికి పుష్కరాలు నిర్వహిస్తారు. 2008లో సమైక్య రాష్ట్రంలో చివరి తుంగభద్ర పుష్కరాలు జరిగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి తుంగభద్ర పుష్కరాలు ఈ నెల 20నుంచి 12రోజుల పాటు ఉంటాయి. పుష్కరాలు జరిపే 12 నదులలో తుంగభద్ర ఒకటి. నవగ్రహాల్లో ఒకటైన గురు గ్రహం సంవత్సరానికి ఒకసారి చొప్పున 12 రాశుల్లో పరిభ్రమిస్తుంటుంది. బృహస్పతి మకరరాశిలో ప్రవేశించే సమయంలో తుంగభద్ర నదికి పుష్కరాలు నిర్వహిస్తారు. ఈ పుష్కరాలు జరిగే 12రోజుల్లో ముక్కోటి దేవతలు ఆ నదిలో కొలువై ఉంటారని ప్రతీతి. ఈ సమయంలో ఆ నదిలో స్నానమాచరించిన వారి పాపాలు తొలిగి.. పుణ్యం సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. తుంగభద్ర నదీతీర దేవాలయాలు సుందరీకరణ చేపట్టారు. తుంగభద్ర తీరాన ఆలయాలు గమనిస్తే కర్ణాటక రాష్ట్రంలో శృంగేరి శారదాంబ దేవాలయం (చిక్కగుళూరు), వంపావతి దేవాలయం(కంప్లి), హరిహరేశ్వర దేవాలయం(హంపి). ఏపిలో రాఘవేంద్ర స్వామి ఆలయం, (మంత్రాలయం), శివరామాలయం (గుండ్రేవుల). తెలంగాణలో సంతాన వేణుగోపాలస్వామి ఆలయం (వేణిసోంపురం), వైకుంఠ నారాయణ స్వామి ఆలయం (రాజోళి), సూర్యనారాయణ స్వామి ఆలయం (పుల్లూరు), జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు (అలంపూర్), సంగమేశ్వరాలయం ఉన్నాయి. కర్ణాటక ఎగువ భాగాన ఉన్న పశ్చిమ కనుమలలో ఉద్భవించినవే తుంగ, భద్ర నదులు కలిసి తుంగభద్ర నదిగా మారి.. కర్ణాటకలో కృష్ణా పరివాహక ప్రాంతం మీదుగా ప్రవహిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం మేళగనూరు వద్ద ప్రవేశిస్తుంది. తెలంగాణలో జోగుళాంబగద్వాల జిల్లా అయిజ మండలం కుట్కనూరు వద్ద తుంగభద్ర రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అనంతరం పులికల్, రాజోళి, పుల్లూరు మీదుగా సాగుతూ నదీతీరంలో కొలువైన దేవాదిదేవతల పాదాలను అభిషేకిస్తూ.. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. తుంగభద్ర నది రాష్ట్రంలో ప్రవేశించిన తర్వాత సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రవహించి సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో సంగమం అవుతున్నది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురువడంతో కృష్ణ, తుంగభద్ర నదులు జలకళను సంతరించుకున్నాయి. ఆలంపూర్ పుణ్యక్షేత్రం వద్ద భక్తులు స్నానమాచరించడానికి విశాలమైన పుష్కర ఘాట్లు సిద్ధంగా ఉన్నాయి. ఈ నెల 20నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో కట్టుదిట్టంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎవరూ ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇప్పటికే మంత్రులు జోగులాంబ జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే కర్నూలుఓ ఎపి మంత్రులు పర్యటించి అక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. కొవిడ్ నిబంధనల మేరకు పుష్కరాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించాకే పుణ్యస్నానాలకు అనుమతి లభించనున్నది. జోగులాంబ గద్వాల జిల్లాలో నది ప్రవహించే ప్రాంతాలైన వేణి సోంపురం, రాజోళి, పుల్లూరు, అలంపూర్ వద్ద ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఘాట్లు ఏర్పాటు చేయనున్నది. తుంగే పానీ.. గంగే స్నానే అన్నది ఆర్యోక్తి. గంగానదిలో స్నానం చేస్తే ఎంత పుణ్యం వస్తుందో తుంగభద్ర జలాలు తాగితే అంతే పుణ్యం వస్తుందని దీనికి అర్థం. అత్యంత ప్రాశస్త్యమున్న తుంగభద్ర నదీ పుష్కరాలకు భక్తులు సైతం అదేస్థాయిలో ప్రాధాన్యమిస్తారు. ఈ నేపథ్యంలో తుంగభద్ర పుష్కరాలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొవిడ్ పథ్యంలో పుష్కరాలకు వచ్చే వారిసంఖ్యను ముందే అంచనా వేసి.. ఎవరూ ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. పుష్కరాల కోసం నిర్దేశిరచిన పనులను యుద్ధ ప్రాతిపదికన ఈ నెల16 నాటికి పూర్తిచేయాలని నిర్దేశిరచింది. నవంబర్ 20న ప్రారంభమయ్యే తుంగభద్ర పుష్కరాలు డిసెంబర్ 1న ముగుస్తాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో నాలుగు పుష్కర ఘాట్లలో ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చూసేందుకు ఎగువ నుంచి నీటి విడుదలకు ఏర్పాట్లు చేస్తారు.

# జనసునామీని తలపించిన పెద్దిరెడ్డి పాదయాత్ర

**హామీలను నేరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌ది**
**ప్రజా క్షేత్రంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నాం**
**–రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

చిత్తూరు,నవంబర్9(ఆర్ఎన్ఎ): ఇన్చార్జ్ పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రజా సంకల్పయాత్ర మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా ఆయనకి సంఫీబావంగా స్థానిక ఎమ్మెల్యే,రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మరియు భూగర్భ గనుల శాఖ మంత్రి చేస్తున్న పాదయాత్ర సోమల మండలంలోని ఇరికిపెంట వద్దకు చేరుకోగానే సోమల మండల పార్టీ ఇన్చార్జ్ పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పార్టీ నేతలు ఘనంగా బాన సంచా కాల్చుతూ స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన చూసి రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే దానిని చూసి మరో వైపు ప్రతిపక్ష పార్టీ గుండెల్లో గుబులు మొదలైందని అన్నారు.వైఎస్ఆర్ సిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా క్షేత్రంలో ప్రజల మన్ననలను పొందుతుందన్నారు.అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసమే వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర ద్వార ప్రజలు కష్ట సుఖాలను నేరుగా తెలుసు కొనేందుకు పాదయాత్ర చేపట్టారని దానికి అనుగుణంగా దేశంలో ఏ పార్టీ కి రాని విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మ రథం పడుతూ 151 అసెంబ్లీ స్థానాలు ఇచ్చారని అన్నారు.నాటి నుంచి నేటి వరకు ప్రజలకు ఎమి కావాలో అడగకనే ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కి దక్కుతుందని అన్నారు.నవరత్నాల ద్వారా ప్రజలకు రాజన్న పాలనని తిరిగి ఇచ్చారని అన్నారు.వైఎస్ జగన్ పాలనలో మరో 15 సంవత్సరాలు వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం అధికారంలో వుంటుందని పెర్కొన్నారు. మండలంలో మరుపెన్నడూ లేని విధంగా వైఎస్ జగన్ ప్రవేశ పెడుతున్న పథకాలకు హర్షిస్తూ సోమల మండలంలోని ప్రజలు మంత్రి పెద్దిరెడ్డి పాదయాత్రకు బ్రహ్మ రథం పట్టారు.మండల అభివృద్ధి కార్యాలయం వద్ద ఎంపిడివో రామచంద్ర, తహశీల్దారు శ్యాంప్రసాద్ రెడ్డి సోమలలో అడుగు పెట్టిన ఆయనకు సోమల సింగిల్ విండో అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, సోమల ఎంపిటిసి సభ్యులు వరదం సావిత్రి వెంకటరమణ మరియు యూత్ నేతల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో సోమల వైఎస్ఆర్ సిపి ఇన్చార్జ్, యువనేత పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి,వైసిపి రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల పరిశీలకులు నాగ రాజారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగాధరం, యూత్ అధ్యక్షుడు వరదం కుమార్ రాజ,యువజన నేతలు ఐలా సురేంద్ర, పొంగుబాల క్రిష్ణ ప్రసాద్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు,మాజీ ఎంపిపి ఝాన్సీ లక్ష్మి ఎంపిటిసిలు,మాజీ సర్పంచ్లు,ప్రజా ప్రతి నిధులు పాల్గోన్నారు.

# ప్రపంచవ్యాప్తంగా 5కోట్లు దాటిన కరోనా కేసులు

**12లక్షల మరణాలు: జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వెల్లడి**

న్యూఢిల్లీ,నవంబర్9(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ మరో మైలురాయిని అందుకున్నది. ప్రపంచ వ్యాప్తంగా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య 5 కోట్లు దాటింది. ఈ విషయాన్ని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వెల్లడించింది. ఆదివారం నాటికి ప్రపంచవ్యాప్తంగా 5.2 కోట్ల కేసులు నమోదు అయినట్లు ఆ వర్సిటీ చెప్పింది. మహమ్మారి వ్యాప్తి ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 12 లక్షల మరణాలు సంభవించాయి. అమెరికాలో అయిదో వంతు కేసులు రిపోర్ట్ అయినట్లు వర్సిటీ వెల్లడించింది. జాన్స్ హాప్కిన్స్ వర్సిటీ డేటా ప్రకారం.. అమెరికాలో 9.8 మిలియన్ల కేసులు నమోదు అయ్యాయి. 2,37000 వేల మంది మరణించారు. తాజాగా అమెరికాతో పాటు పలు దేశాల్లో కరోనా వైరస్ కేసులు పెరుగుతున్నాయి. శనివారం రోజున ఆ దేశంలో 1,26000 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. దాదాపు వెయ్యి మందికిపైగా మరణించారు.

# ఢిల్లీలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

**వారం వ్యవధిలో 401 మరణాలు నమోదు**

న్యూఢిల్లీ,నవంబర్9(ఆర్ఎన్ఎ): దేశరాజధాని ఢిల్లీలో కరోనా కేసులు రికార్డు స్థాయిలో పెరుగుతుండగా, మృతుల సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతోంది. వారం రోజుల వ్యవధిలో ఢిల్లీలో కరోనా కారణంగా 401 మరణాలు చోటుచేసుకున్నాయి. జూన్ తరువాత వారం రోజుల వ్యవధిలో ఇన్ని మరణాలు సంభవించడం తిరిగి ఇప్పుడు చోటుచేసుకుంది. వైద్య నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం గాలి కాలుష్యం కూడా కరోనా మరణాల పెరుగుదలకు ఒక కారణంగా తెలుస్తోంది. ఢిల్లీ వైద్య ఆరోగ్యశాఖ తెలిపిన గణాంకాల ప్రకారం కరోనా కారణంగా శనివారు 79 మంది మృతి చెందారు. జూన్ 15 తరువాత ఒక్కరోజులో ఇంతమంది మరణించడం మళ్లీ చోటుచేసుకుంది. శుక్రవారం కూడా కరోనా కారణంగా 64 మంది మృతి చెందారు. అయితే మొత్తం మీద చూసుకుంటే ఢిల్లీలో మృతుల సంఖ్య తగ్గుతూనే వస్తోంది. ప్రస్తుతం ఇది 1.61 శాతంగా ఉంది. ఈ సందర్భంగా ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ విక్రమ్ మాట్లాడుతూ ప్రస్తుతం నమోదవుతున్న కేసుల కన్నా మృతుల సంఖ్య చాలా తక్కువగానే ఉన్నదన్నారు. అయితే మృతుల శాతాన్ని ఇంకా తగ్గించాల్సివుందన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న వాయు కాలుష్యం ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నదన్నారు. ఇది కరోనా బాధితులకు ప్రమాదకరంగా మారిందన్నారు.

# ట్రంప్ మాదిరిగానే బీజేపీ ఓడిపోతుంది: ముఫ్తీ



శ్రీనగర్,నవంబర్ 9: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాదిరిగానే బీజేపీ కూడా ఓడిపోతుందని జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ అన్నారు. జమ్ముకు చెందిన పలు వర్గాలతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బీజేపీపై మండిపడ్డారు. 'అమెరికాలో ఏం జరిగిందో చూశాం. ట్రంప్ దిగిపోయారు. అదే మాదిరిగా బీజేపీ కూడా' అని వ్యాఖ్యానించారు. జమ్ముకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి సంబంధించిన ఆర్టికల్ 370ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత ఏడాది రద్దు చేయడంపై మెహబూబా విమర్శించారు. ఆర్టికల్ 370 అనేది ముస్లింలు లేక హిందువులకు సంబంధించిన అంశం కాదన్నారు. జమ్ముకశ్మీర్ ఉనికిని కాపాడేందుకు తెచ్చిన ప్రత్యేక చట్టమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేయడమేగాక అంబేద్కర్ రాజ్యాంగాన్ని కూడా అవమానించిందని విమర్శించారు. దీన్ని రద్దు చేయడం వల్ల భవిష్యత్తు గురించి జమ్ముకశ్మీర్ ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు.

జమ్ముకశ్మీర్‌ను బీజేపీ అమ్మకానికి పెట్టిందని, ఇక్కడి భూములను కొనుగోలు చేయాలని బయటి వ్యక్తులను ఆహ్వానిస్తున్నదని ముఫ్తీ మండిపడ్డారు. మరి పండిట్ల గురించి ఏం ఆలోచించారు అని కేంద్రాన్ని ప్రశ్నించారు. కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పడి ఏడాదైనా కశ్మీర్ యువతకు ఎలాంటి ఉద్యోగాలు కల్పించలేదన్నారు. దీంతో మరోదారి లేక వారు తుపాకులను చేతపడుతున్నారని అన్నారు. సరిహద్దులో కాల్పుల గురించి మాట్లాడుతూ తిరంగా జెండా కోసం వేలాది మంది తమ ప్రాణాలను త్యాగం చేస్తున్నారని చెప్పారు. భారత్, పాకిస్థాన్ మధ్య జమ్ముకశ్మీర్ ఒక వారధిగా ఉండాలని ముఫ్తీ తెలిపారు. బీహార్‌లోని మహాకూటమి సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్‌కు ఆమె అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో ఆయన సరైన పంథా అనుసరించారని కొనియాడారు.

# రగుడు బైపాస్ జంక్షన్ ను అభివృద్ధి చేయాలి

**–మున్సిపల్ అధికారులను ఆదేశించిన కలెక్టర్**



రాజన్న సిరిసిల్లా, నవంబర్ 9 (నేటినిజం ప్రతినిధి):సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో రగుడు బైపాస్ జంక్షన్ ను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఆయన రగుడు జంక్షన్ ను సిరిసిల్ల మున్సిపల్ అధికారులతో కలిసి సందర్శించి జంక్షన్ అభివృద్ధికి చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

ప్రయాణికులకు, కొత్త కలెక్టరేట్ కు వచ్చే ఉద్యోగులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక డివైడర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. బైపాస్ జంక్షన్ వద్ద నూతన సర్కిల్ ను నిర్మించాలని, సర్కిల్ లో ల్యాండ్ స్కేప్ పార్కు, ఫుట్ పాత్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. సిరిసిల్ల పట్టణంలో నిర్మించిన జంక్షన్ ల తరహాలో ఈ రగుడు బైపాస్ జంక్షన్ ను నిర్మించాలని కోరారు. అలాగే మున్సిపల్ వాహనాలు డంపింగ్ యార్డుకు వెళ్ళడానికి ఎస్సార్ పెట్రోల్ బంక్ నుండి కలెక్టరేట్ రోడ్డును ఆనుకుని డంపింగ్ యార్డు వరకు 33 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపడితే వాహనాల రాకపోకలకు సులభంగా ఉంటుందని, దీని వలన కలిగే ప్రయోజనాలపై మున్సిపల్ అధికారులు తగిన సాధ్యాసాధ్యాలు పరిశీలించి వీలైనంత త్వరగా తమకు నివేదిక సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్శనలో మున్సిపల్ కమీషనర్ శ్రీ సమ్మయ్య, వైస్ చైర్మన్ శ్రీ మంచే శ్రీనివాస్, డి ఈ వేంకట శేషయ్య, టి పి ఓ అన్సార్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పన్నులను చెల్లించడమూ ఓ గొప్పేనా?

**కెటిఆర్ జేబులోంచి పైసా ఇవ్వడం లేదు: ధర్మపురి అర్వింద్**

హైదరాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ): నగర ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సాయం పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన డబ్బేనని గుర్తుంచుకోవాలని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ అన్నారు. తమ సొంత జేబులోంచి పైసా చెల్లించడం లేదని మంత్రి కేటీఆర్‌పై ఎంపి అర్వింద్ ఫైర్ అయ్యారు. ప్రభుత్వ సాయం కేటీఆర్ జేబులో నుంచి ఇవ్వడం లేదన్నారు. ప్రజాప్రతినిధులకు ఇస్తున్న జీతాలు ప్రజల డబ్బే అని పేర్కొన్నారు. ప్రజల డబ్బులనే ఇస్తూ.. దాన్నే డబ్బా కొట్టుకుంటున్నారన్నారని విమర్శించారు. పాతబస్తీలో పాన్ దుకాణం తీయాలన్నా..కేటీఆర్ ప్యాంట్ తడుస్తుందన్నారు. ఓల్డ్ సిటీలో అక్రమ నిర్మాణాలు కూల్చే దమ్ము కేటీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. హైదరాబాద్ ప్రజలకు డబుల్ డెక్కర్ కాదు.. డబుల్ బెడ్రూం ఇళ్లు కావాలన్నారు. వరద సాయం ప్రజల పన్నులతోనే ఇస్తున్నారని.. మీ జేబులోంచి ఇవ్వడం లేదని కేటీఆర్ ను విమర్శించారు.

# రాజ్యలక్ష్మి కథల్లో బంధాలు అనుబంధాలు

సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయిన ఈ కాలంలో చదవడం అనే అభిరుచి తగ్గిపోయింది. కథల్లో ఉండే ఒక పేజీ వర్ణన టివిలో ఒక్క క్షణంలో చూసేస్తారు. చదవాలనుకున్నవన్నీ అంతర్జాలంలో కనిపిస్తున్నాయి. అందువల్ల అనేక మంది చదివే అలవాటును మరచిపోయారు. ఇక కొత్త తరానికి చదవాలనే విషయం ఎవరూ చెప్పడం లేదు. అయినా కథలు, కథల పుస్తకాలు ఇంకా వస్తూనే ఉన్నాయి. చదివేవాళ్ళు చదువుతూనే ఉన్నారు. చదవడంలో ఉన్న తృప్తి అంతర్జాలంలో చూస్తే లభించదు. ఈ విషయం సాహితీ ప్రియులకు మాత్రమే అర్థమవుతుంది. అంతర్జాలానికి, టివిలకు అతుక్కుపోయే వారిని కథలు చదివేలా చేయాలంటే కథల్లో ఆకట్టుకునే అంశాలు ఉండాలి. అలాంటి కథలను చదవడానికి ఎవరైనా ఇష్టపడతారు. అలా ఇష్టపడి చదివే అంశాలు **వావిలికొలను రాజ్యలక్ష్మి** కథల సంపుటి **పూల దోసిళ్ళు**లో పుష్కలంగా ఉంటాయి. సృష్టి ఉన్నంత వరకు మానవ సంబంధాలు ఉంటాయి. మానవుల మధ్య ఉండే బంధాలు అనుబంధాలను ఆవిష్కరించే కథలను పాఠకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. అలాంటి కథలు ఈ సంపుటిలో అందించిన రచయిత్రి అభినందనీయురాలు.

కావ్య–కార్తీక్

ఈ కథలో తల్లి తండ్రి కొడుకు మధ్య ఉండే బంధాలు అనుబంధాలను చక్కగా చూపించారు రచయిత్రి రాజ్యలక్ష్మి. గోవిందం అతని భార్య వసంత వారి కొడుకు కార్తీక్. కొడుకంటే ఆ దంపతులకు ఎనలేని ప్రేమ. హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నారు. కష్టపడి కులవృత్తి చేసుకొని జీవించే ఆ దంపతులు కార్తీక్ పైనే ఆశలు పెట్టుకున్నారు. అతని భవిష్యత్తు బాగుండాలని నెల నెలా డబ్బులు పంపిస్తూ చదివిస్తున్నారు. కార్తీక్ కోసం తల్లితండ్రులు ఇంటిపైన ప్రత్యేకంగా ఒక గది కట్టించాలనుకొని కష్టపడి సంపాదించే ఆ కాస్త డబ్బుల్లోంచి కొంత వెనకేస్తున్నారంటే వారి మధ్య ఉన్న బంధం అనుబంధం ఏమిటో మనకు అర్థమవుతుంది.

ఈ కథకు **కావ్య–కార్తీక్** అనే పేరు చక్కగా సరిపోయింది. వాళ్లే ఈ కథలో కథానాయకి, కథానాయకుడు. ఒకే కళాశాలలో చదువుకునే కావ్య కార్తీక్‌లు ప్రేమలో పడ్డారు. వాళ్లిద్దరి మధ్యనున్న బంధాలు అనుబంధాలను రచయిత్రి **వావిలికొలను రాజ్యలక్ష్మి** చక్కగా ఆవిష్కరించారు.

గోవిందం, వసంత మధ్యనున్న భార్యాభర్తల అనుబంధం కూడా చక్కగా వివరించారు. కష్టాన్ని ఎలా తప్పించుకోవాలని ఆలోచించే ఈ రోజుల్లో ఒకరి కష్టాన్ని మరొకరు పంచుకోవడం వారి అనుబంధానికి నిదర్శనం.

తల్లితండ్రులు కొడుకు కోసం ఎదురు చూడడం, తల్లి తాను తినకుండా అబ్బాయి వచ్చేవరకు వేచి ఉండడం. కొడుకు కోసం ప్రత్యేక వంటలు చేయడం. తల్లితండ్రులు పడుతున్న కష్టాన్ని చూసి కొడుకు బాధ పడడం, తనకు ఉద్యోగం వచ్చాక వాళ్లతో ఏ పని చేయించకుండా చూసుకోవాలనుకోవడం వారి మధ్యనున్న అనుబంధాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు.

ఓ రోజు తండ్రి వద్దన్నా కూడా కార్తీక్ తన తండ్రి ఇస్త్రీ చేసే డబ్బా దగ్గరకెళ్లాడు. కళ్యాణమ్మ గారి బట్టలు తానే ఇచ్చి డబ్బులు తెస్తానని సైకిల్ మీద బయలుదేరాడు. ధనవంతులైన కళ్యాణమ్మ గారి కూతురే కావ్య. తన మీద కావ్యకు ఉన్నది నిజమైన ప్రేమా కాదా తెలుసుకోవడానికే అలా వెళ్లాడు కార్తీక్. ఇస్త్రీ చేసుకొని జీవించే కుటుంబం అని తెలిసి కార్తీక్‌ను కాదనుకుంది కావ్య.

కావ్య నిజస్వరూపం తెలిసిన కార్తీక్ ఇక నుండి కష్టపడి చదివి, ర్యాంక్ తెచ్చుకొని తన కోసం రాత్రనక పగలనక కష్టపడుతున్న తల్లిదండ్రులను బాగా చూసుకోవాలనే తపనతో ఆ దిశగా తను సాగిపోవడం ఈ కథలోని కొసమెరుపు.

వెంకన్న

**పూల దోసిళ్లు** కథల సంపుటిలో అనుబంధాలకు ప్రాధాన్యత ఉన్న మరో కథ **వెంకన్న**. ఆనంద్, కరుణ దంపతుల కొడుకు రాము. వీరి మధ్యన ఉన్న బంధాలు, అనుబంధాలను చక్కటి కథ రూపంలో అందించారు రచయిత్రి. పదేళ్ల రాము ఏదో తెలియని బాధతో సతమతమవడం, అది చూసి తల్లితండ్రులు తట్టుకోలేకపోవడం లాంటి దృశ్యాలను కళ్లకు కట్టినట్టు చక్కగా వర్ణించారు.

తలకు దెబ్బతగిలి ఆసుపత్రిలో ఉన్న రామును చూసి తల్లితండ్రులు పడే ఆందోళన పాఠకులను కంటతడి పెట్టిస్తుంది. పగలు, రాత్రి నిద్ర, ఆహారాలు మాని కంటికి రెప్పలా చూసుకునే సన్నివేషం బంధాలకు, అనుబంధాలకు ఉన్న విలువను తెలియజేస్తుంది.

రాముకు గత జన్మ గుర్తుకు రావడం. తన వాళ్లను చూసొస్తానని తల్లితో చెప్పడం గత జన్మ అనుబంధాలను కూడా మరిచిపోకుండా రాము గుర్తు చేసుకోవడం ఎవరికైనా ఆశ్చర్యం కలిగిస్తుంది. అలాగే తల్లిని వదలి వెళ్లనని, గత జన్మలో తనకు తల్లి లేదని అందుకని ఈ తల్లితోనే ఉంటానని నిర్ణయించుకోవడం బంధాలు ఎంత బలమైనవో అవగతమవుతుంది.

రాము తండ్రి ఆనంద్ కూడా రాము గత జన్మకు సంబంధించిన బంధాల గురించి కూడా వాకబు చేయడం విభిన్నంగా ఉంది.

మెలుకవ వచ్చిన రాము ఉత్సాహంగా, ఆనందంగా మాట్లాడడం చూసి తల్లితండ్రులు ఎంతగానో మురిసిపోయారు. ఇవన్నీ కూడా అనుబంధాలను గుర్తుచేస్తాయి. అయితే రాముకు సంబంధించిన గతజన్మ అంతా ఆనంద్ కలగన్నాడనేది ఈ కథలోని మలుపు.

బామ్మ మాట

పెద్దవాళ్ల సహాయం సహకారం బంధాలకు అనుబంధాలకు ఎంత అవసరమో ఈ **బామ్మ మాట** కథ మనకు బోధిస్తుంది. అనసూయమ్మ తన కూతురి కొడుకు కోడలు ఇద్దరూ ఉద్యోగస్తులే. వాళ్ల చంటి పాపను చూసుకోవడానికి అనసూయమ్మ సహాయం కోరారు. బంధాలు అనుబంధాల కోసం దూర భారాలు లెక్క చేయకుండా ఈ వయసులో కూడా వెళ్లింది అనసూయమ్మ. మనవడు భావిన్, అతని భార్య ఇద్దరూ అనసూయను ఎంతో అప్యాయంగా స్వాగతించారు. భావిన్ అమ్మమ్మతో చిన్న నాటి అనుభవాలను, అనుభూతులను భార్య వాణితో చెప్పుకున్నాడు. ప్రతివారికి అమ్మమ్మతో, అమ్మమ్మ ఇంటితో అనుబంధం ఉంటుంది. ఈ కథ చదువుతున్న వారికి అవన్నీ ఒక్కసారిగా గుర్తుకు వస్తాయి.

పాపాయిని బాగా చూసుకోవడం, పాటలు పాడుతూ ఆడించడం అనసూయమ్మకు అదే లోకం అయిపోయింది. పాపాయి ఆలనా పాలనలో అంతగా మునిగిపోయిందంటే ఆమెకు బంధాలు అనుబంధాల పట్ల ఎంత మక్కువ ఉండో అర్థం చేసుకోవచ్చు.

ఎక్కువ కాలం అక్కడ ఉండడం సాధ్యం కానీ అనసూయమ్మ వాళ్లకు ఇబ్బంది కలుగకుండా పాపాయిని తనతో పాటు ఊరికి తీసుకు వెళ్లి పెంచుతానని చెప్పడం కథలోని పాత్రలకే కాదు, కథ చదువుతున్న పాఠకులకు కూడా ఆమోదయోగ్యమే. పెద్దవాళ్లతో అనుబంధం ఎంత అవసరమో ఈ కథ ద్వారా రచయిత్రి చక్కగా ఆవిష్కరించారు.

తారుమారు

**పూల దోసిళ్లు** కథల సంపుటిలో ఏ కథకు ఆ కథే విభిన్నంగా ఉంటాయి. ఒక్కో కథలో ఒక్కో విధంగా అనుబంధాలను ఆవిష్కరించారు. **తారుమారు** కథలో కూడా అనుబంధాలను అద్భుతంగా మలచిన తీరు మనం గమనించవచ్చు. ఈ కథలో ఉమ ఈనే పాత్రలో అంతులేని బంధాలను అనుబంధాలను ఇమిడ్చారు రచయిత్రి **వావిలికొలను రాజ్యలక్ష్మి**. అంతకన్నా గొప్ప పాత్ర నాంచరమ్మ. బంధాల కోసం, అనుబంధాల కోసమే బతికే ఇలాంటి పాత్రలు చాలా అరుదుగా కనిపిస్తాయి. ఈ రోజుల్లో అయితే అసలు కనబడవనే చెప్పుకోవాలి.

నాంచారమ్మ కూతురు, అల్లుడు బస్సు ప్రమాదంలో మరణిస్తే వారి ఆరు నెలల పాప ఉమను పెంచి పోషించే బాధ్యత తన మీదే పడింది. అంతే కాకుండా అదే సంవత్సరంలో కోడలు రోడ్డు ప్రమాదంలో మరణించింది. మూడేళ్ల వయసున్న మనవడు ప్రభాత్‌ను కూడా పెంచే బాధ్యత పూర్తిగా నాంచరమ్మ పైనే పడింది. ఈ బంధాలే కాదు తన పిల్లలు చిన్న తనంలో ఉండగానే నాంచారమ్మ భర్త మరణించాడు. వాళ్లను పెంచి పెద్ద చేసి, చదివించి, పెళ్లిల్లు చేసిన తను ఎన్ని బంధాలను బలోపేతం చేసిందో అర్థం చేసుకోవచ్చు. విశ్రాంతి తీసుకోవలసిన ఈ వయసులో మనవరాలు, మనవడి బాధ్యతలు కూడా మీదేసుకొని పెంచి పెద్ద చేసిందంటే బంధాల కోసం ఆమె పడిన తపన వ్యక్తమవుతోంది. ఉమ తన బావ ప్రభాత్ పట్ల మానసికంగా అనుబంధాన్ని పెంచుకుంది. అతన్ని పెళ్లి చేసుకోవాలని ఆరాటపడింది. ఈ విషయాన్ని ఎన్నోసార్లు అమ్మమ్మను అడిగింది. అనుబంధాలను ప్రేమించే ఉమ, వాటిని నిర్లక్ష్యం చేసేవాళ్లను అసహ్యించుకుంటుంది. వాళ్ల పక్కింటి కల్పనమ్మ కొడుకు రోజు తాగొచ్చి భార్యను చితక్కొడుతుంటే ఎందుకు బుద్ధి చెప్పడం లేదని ఉమ నిలదీస్తుంది. వివాహ బంధానికి విలువనిచ్చి పుట్టింటిని వదలి మెట్టింటికి వచ్చిన ఆడదాన్ని ఇలాగేనా చూసేది అని మందలిస్తుంది. ఈ సన్నివేషం బంధాలకు ఉన్న ప్రాముఖ్యతను తెలియజేస్తాయి.

ఉమ తన బావ ప్రభాత్‌ను చూడాలనిపించినప్పుడు అమ్మమ్మకు ఒంట్లో బాగోలేదని చెప్పి రప్పించుకుంటుంది. అమ్మమ్మ కోసం ఆరాటపడి వచ్చిన ప్రభాత్‌కు అది అబద్ధమని తెలుస్తుంది. మరదలు తనను చూడడం కోసం ఇలా అబద్దం చెప్పిందని అర్థం చేసుకొని వెళ్లిపోయాడు. ఇలా తరుచుగా జరుగుతోంది. ప్రభాత్ పనుల ఒత్తిడి వలన రాలేని పరిస్థితుల్లో కూడా ఉమ ఇచ్చిన సమాచారం నిజమనుకొని ఎన్నోసార్లు వచ్చాడు. ఇది నానమ్మ పట్ల తనకు ఉన్న అనుబంధాన్ని వ్యక్తం చేస్తుంది. ఇలా అబద్దాలు చెప్పడం మంచిది కాదని నాంచారమ్మ తన మనవరాలు ఉమకు ఎంత చెప్పినా తను వినిపించుకోలేదు.

మరోసారి ఉమ ఫోన్ చేసింది. అమ్మమ్మకు గుండెపోటు వచ్చిందని వెంటనే రమ్మని ప్రభాత్‌కు ఫోన్‌లో చెప్పింది. అతను పని ఒత్తిడిలో ఉండి పట్టించుకోలేదు. పైగా ఇలాంటి తప్పుడు సమాచారం ఇవ్వడం ఉమకు అలవాటేగా అని అనుకున్నాడు. అయితే తన నానమ్మ నిజంగానే గుండెపోటుతో మరణించిందని తెలుసుకున్న పభాత్ ఆందోళనతో పరుగులు పెట్టాడు.

మనం చిన్నప్పుడు చదువుకున్న **నాయనా పులి వచ్చే** అనే కథను తీసుకొని దానిలో బంధాలు అనుబంధాలు జోడించి ఈ విధంగా నూతనంగా అందించిన రచయిత్రి నిజంగా అభినందనీయురాలు.

నా ప్రియనేస్తం

ఈ కథల సంపుటిలో అనుబంధాలను తెలిపే మరో కథ **నా ప్రియనేస్తం**. ఈ కథలో చిన్ననాటి స్నేహితుల మధ్య ఉన్న అనుబంధాన్ని చెప్పడం విశేషం.

నాగమ్మ, బుచ్చన్న అనే దంపతులు పిల్లల కోసం ఎంతగానో పరితపించారు. ఆ అనుబంధాన్ని అనుభవించాలని కలలు కన్నారు. కానీ వారి కలలు నిజం కాలేదు. ఓ అనాథ పిల్లను తెచ్చి పెంచుకోవడమంటే వారికి అనుబంధాల పట్ల ఉన్న ఆసక్తిని వ్యక్తం చేస్తుంది. ఆ పిల్లతో పరిచయం చేసుకున్న మరో అమ్మాయికి ఆ పరిచయం స్నేహంగా మారింది. చిన్న తనంలో ఏర్పడిన ఆ అనుబంధాన్ని పెళ్లయి అత్తారింటికి వెళ్లిన తర్వాత కూడా మరచి పోకుండా ఆ స్నేహితురాలిని కలుసుకోవాలనే తపన రచయిత్రి తనదైన శైలిలో వ్యక్తం చేయడం పాఠకులను ఆకట్టుకుంది.

**మనసే వెన్నెలగా...**

కొందరు బంధాలను అనుబంధాలనను కలకాలం గుర్తుంచుకుంటారు. మరి కొందరు మరుక్షణంలోనే మరచిపోతారు. కోడలు తన పెళ్లి రోజును మరచిపోయింది. అత్తమ్మ గుర్తు చేసింది. కోడలు పెళ్లిరోజును బాగా జరిపించాలనుకునే అత్తగారి ఆరాటం బంధాలను జ్ఞప్తికి తెస్తాయి.

భార్యాభర్తల ప్రేమానురాగాలు, కొడుకునే పెంచే పద్ధతుల్లో అనుబంధాలను చక్కగా అభివర్ణించారు రచయిత్రి. సవతి తల్లి పంకజాక్షిని తేజస్ కన్న తల్లి కన్నా ఎక్కువగా ప్రేమించాడు. వాళ్ల అనుబంధం చూసే వాళ్లకు ఎంత గొప్పగా కనిపించేది.

జీవితంలో బంధాలను, అనుబంధాల సంపదను కోల్పోవడం ఎంత బాధాకరమో భానుమతి అనుభవించింది. ఎంతగానో రోధించింది. నిజమైన బంధాలు అనుబంధాలు ఎప్పటికీ కోల్పోకూడదని ఆమె భావించడం అనుబంధాల విలువలను గుర్తుకు తెస్తాయి.

సిరి సంపదలకన్నా విలువైనవి బంధాలని ఆమె తెలుసుకోవడం గొప్ప విషయం. చెప్పుడు మాటలు బంధాలను అనుబంధాలను ఎంతగా దెబ్బతీస్తాయో ఈ కథలో వివరించారు రచయిత్రి. ఇలాంటివి మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తాయన్న విషయం ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు. సినిమాల్లో చూపించినట్లు బంధాలను గెలుచుకోలేమన్న సత్యాన్ని ఈ కథ చాటి చెబుతుంది. అందరు ఉండి ఒంటరిగా బతకడం కష్టమని, తన వాళ్ల కోసం బతకాలనుకోవడం బంధాల ప్రాముఖ్యతను తెలియజేస్తుంది.

వంశిణీ భర్త తన తప్పు తెలుసుకోవడం, క్షమాపణ కోరుకోవడం ఈ కథలో బంధాల విలువను తెలియజేస్తుంది. పశ్చాత్తాపం చెంది బంధాల విలువను, అనుబంధాల గొప్పతనాన్ని తెలుసుకోవడం ఈ కథలో అందరిని అలరించే అంశం.

ఆధునిక సతీ సావిత్రి

ఈ కథ పేరులోనే బంధాలు అనుబంధాలు ఎంత ఇదిగా ఉంటాయో అర్థమవుతుంది. ఈ కథలో భర్త ప్రాణాలు కాపాడుకోవాలనుకోవడం ప్రధానాంశం అని అందరికీ అవగతమవుతుంది. ఓ పాత కథను తీసుకొని ఈ కాలానికి అనుగుణంగా మలిచి అందులో బంధుత్వాలను కలిపి పాఠకులకు అందించడం గొప్ప విషయం.

ఈ కథలో బంధాలు అనుబంధాలకు సంబంధించిన అంశాలు పుష్కలంగా ఉన్నాయి. బంధాలు అనుబంధాలకు సంబంధించి, వాటి విలువలను చాటి చెబుతూ రచయిత్రి అందించిన ఈ కథల సంపుటి అందరికి ఉపయుక్తం.



–సయ్యద్ అఫ్రీన్ బెగం
సెల్: 9908028835

# కార్గో సేవలతో పెరగనున్న ఆర్టీసీ ఆదాయం

### తాండూరులో వాణిజ్య సముదాయం ప్రారంభించిన పువ్వాడ

వికారాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ): రవాణా శాఖలో నూతన ఒరవడిని సృష్టించామని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. కార్గో సేవలతో ఆర్టీసీకి ఆదాయం పెరగనుందన్నారు. కేవలం ప్రజా రావాణాతో కాకుండా కార్గో సేవలతో మంచి లాభాలు రానున్నాయని అన్నారు. వికారాబాద్ జిల్లాలోని తాండూరు ఆర్టీసీ బస్ స్టేషన్లో నూతనంగా నిర్మించిన వాణిజ్య దుకాణాల సముదాయాన్ని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి పువ్వాడ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు డిపో ఆధునీకరణకు రెండు కోట్ల రూపాయాల నిధులు అందించినట్లు తెలిపారు. రవాణా రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తూ అందుకు అనుగుణంగా ప్రత్యేక కార్గో సేవలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. తెలంగాణ సర్కార్ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీహార్ ఫలితాలపై దేశవ్యాప్త చర్చ

### నేడు వెల్లడి కానున్న ఎన్‌డిఎ భవిష్యత్
### బిజెపిపై ప్రభావం చూపనున్న ఉప ఎన్నికల ఫలితాలు
### దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు
### కౌంటింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణతో ఉండాలన్న తేజస్వి

న్యూఢిల్లీ,నవంబర్9(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా బీహార్ అసెంబ్లీతో పాటు పది రాష్ట్రాల్లోని 54 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలకు సంబంధించి మంగళవారం కౌటింగ్ జరుగనుంది. ఈ ఎన్నికల ఫలితాలు బీహార్‌లో ఎన్‌డిఎ భవిష్యత్‌ను తేల్చనున్నాయి.

ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. తెలంగాణ, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, ఝార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, నాగాలాండ్ రాష్ట్రాల్లో వివిధ కారణాల వల్ల పలు స్థానాలు ఖాళీ కాగా.. కేంద్ర ఎన్నికల సంఘం ఆయా స్థానాలకు ఇటీవల ఎన్నికలు నిర్వహించింది. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 28 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా గుజరాత్‌లో ఎనిమిది, యూపీలో ఏడు, కర్ణాటక, ఒడిశా, జార్ఖండ్, నాగాలాండ్‌లో రెండు చొప్పున, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, హర్యానాలో ఒక్కో స్థానానికి ఎన్నికలు జరిగాయి. సాయంత్రం ఆరుగంటల దాకా పోలింగ్ కొనసాగగా అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. నవంబర్ 10న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. ఇదిలాఉండగా బీహార్ శాసనసభకు మూడు విడుతల్లో ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే.

ఎగ్జిట్ పోల్స్ ప్రకారం బీహార్‌లో మహాగట్‌బంధన్ ముందంజలో ఉంది. దీంతో తేజస్వి యాదవ్ సిఎం కానున్నారన్న ప్రచారం సాగుతోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి ఎన్నికల లెక్కింపు, ఫలితాలపై ఉంది. కౌంటింగ్ రోజున ఆయా కౌంటింగ్ కేంద్రాల వద్ద కార్యకర్తలు క్రమశిక్షణతో ఉండాలని ఆర్జేడీ యువనేత తేజస్వీ యాదవ్ సూచించారు. ఫలితాలు ఎలా వచ్చినా.... పూర్తి సంయమనంతో, క్రమశిక్షణతో ఉండాలని ఆయన ట్వీట్ చేశారు. రాజకీయ ప్రత్యర్థులతో ఎలాంటి ఘర్షణలకు దిగకూడదని, బాణాసంచా కాల్చకూడదని, రౌడీల్లాగా ప్రవర్తించకూడదని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు. ఫలితాలు ఎలా వున్నా.... పూర్తి క్రమశిక్షణతో మసులుకోవాలి. రంగులు పూసుకోవడం, బాణాసంచా కాల్చడం లాంటివి చేయకూడదు. విక్టరీ సంతోషంలో క్రమశిక్షణను మాత్రం తప్పకండి అంటూ తేజస్వీ హెచ్చరికలను జారీ చేశారు. అయితే ఇంతలోనే వెలువడిన ఎగ్జిట్ పోల్స్‌లో మహాఘట్ బంధన్‌కే విజయావకాశాలు ఉన్నట్లు వెల్లడయ్యింది. మహాఘట్ బంధన్‌లో భాగస్వామ్యం కలిగిన కాంగ్రెస్ ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు రాగానే అప్రమత్తం అయిపోయింది. పలు ఎగ్జిట్ పోల్స్‌లో మహాఘట్ బంధన్‌కు సంపూర్ణ విజయం దక్కుతుందనే అంచనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూరజ్‌వాలా, అవినాష్ పాండెలను బీహార్ అబ్జర్వర్లుగా పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ నియమించారు. ఈ నేపథ్యంలో వీరిరువురూ పట్నా చేరుకున్నారు. పార్టీలో నేతలందరి మధ్య సమన్వయాన్ని కుదిర్చే బాధ్యతను పార్టీ ఈ ఇద్దరు అగ్రనేతలకు అప్పగించింది. దీంతో వీరు పట్నాలోని కాంగ్రెస్ కార్యాలయంలో బీహార్ యూనిట్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి, పార్టీ అంతర్గత వ్యవహాలపై చర్చించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు.

# రైతులకు అండగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### మక్కలు వద్దన్నా వేశారు..అయినా కొంటున్నాం
### కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్,నవంబర్9 (ఆర్ఎన్ఎ): రైతులంతా సంతోషంగా ఉండాలని సీఎం కేసీఆర్ ధాన్యం కల్లాల దగ్గరే కొనుగోలు కేంద్రాలు పెట్టి ధాన్యం



మహబూబాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సత్యవతి రాథోడ్

# పదేళ్ల బాలునికి టీఆర్‌కె సాయం

### – సైకిల్ నుంచి కింద పడ్డ శివకృష్ణ
### – కుడి కాలు విరగడంతో ఆస్పత్రిలో శస్త్రచికిత్స
### –వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 9 (నేటినిజం ప్రతినిధి):పదేళ్ల బాలుడు వైద్యం కోసం ఎదురుచూస్తుండగా వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు టి ఆర్ కే ట్రస్ట్ తోట రామ్ కుమార్

వివరాల్లోకి వెళితే

వేములవాడ పట్టణంలోని విద్యానగర్ కు చెందిన కడమంచి శివ కృష్ణ(10) గత నాలుగు రోజుల క్రితం సైకిల్ తొక్కుతూ కింద పడడంతో కుడి కాలు విరిగిపోయింది...

రెండు రోజుల క్రితం....

బాలుని తల్లిదండ్రులు టి ఆర్ కె ట్రస్ట్ కార్యాలయానికి చేరుకొని వైద్యం కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. వెంటనే విషయం తెలుసుకున్న టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ స్పందించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివకృష్ణ కు టి ఆర్ కే ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్, ట్రస్ట్ వర్కింగ్ టీం, ఎంక్వయిరీ టీమ్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. అనంతరం ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్ పదేళ్ల బాలుడు శివ కృష్ణ ఆడుకునే వయసులో కుడి కాలు విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందడం చాలా



బాధాకరమని, బాలుని తల్లిదండ్రులు ట్రస్ట్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు పెట్టుకోగా వైద్య ఖర్చుల నిమిత్తం ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ ఆదేశాల మేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివకృష్ణ సహాయం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వర్కింగ్ టీం, ఎంక్వైరీ టీం సభ్యులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఈ–చాలన్స్ పెండింగ్ వాహనాలపై జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్

### – 3 కంటే ఎక్కువ ఈ– చలాన్స్ పెండింగ్ ఉన్న వాహనాలను సీజ్
### –జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 9 (నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :ట్రాఫిక్ నియమ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వాహనదారులకు విధించిన ట్రాఫిక్ ఈ–చాలన్స్ పై జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. తమ యొక్క వాహనాల పై ఉన్న ఈ–చాలన్స్ ను చెల్లించి వాహనాల సీజ్ కాకుండా చూసుకోవలని, ఇదే విధంగా తమయొక్క వాహనాలపై ఉన్న ట్రాఫిక్ ఈ–చాలన్స్ ను సకాలంలో చెల్లించాలని కోరారు.మూడు కంటే ఎక్కువగా ట్రాఫిక్ ఈ–చాలన్స్ పెండింగ్ లో ఉన్న వాహనాలు జిల్లా వ్యాప్తంగా గుర్తించడం జరిగిందని సదరు వాహనదారులు సకాలంలో తమ యొక్క పెండింగ్



ఈ–చాలన్స్ ను చెల్లించాలని లేనిపక్షంలో సదరు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని, అదే విధంగా 10 కంటే ఎక్కువ ట్రాఫిక్ ఈ చాలన్స్ పెండింగ్ ఉన్న వాహనాలను జిల్లావ్యాప్తంగా గుర్తించడం జరిగిందని సదరు వాహనాలపై దారులపై చార్జిషీటు దాఖలు చేసి సంబంధిత వాహన యజమానుల ను కోర్టులో హాజరుపరచడం జరుగుతుంది అని తెలిపారు. వాహనదారులు తమ వాహనాలపై విధించబడిన ఈ–చాలాన్స్ ను వెంటనే మీసేవ, ఈసేవ, ఇంటర్ నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలన్నారు.వాహనదారులు తమ యొక్క వాహనాలపై ఉన్న పెండింగ్ ఉన్న చాలన్స్ ను echallan.tspolice.gov.in సైట్ లో చూసుకోవచ్చని తెలిపారు. ప్రజలందరూ వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ పోలీస్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

# వేములవాడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముమ్మరంగా సంతకాల సేకరణ

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 9 (నేటనిజం ప్రతినిధి):వేములవాడ పట్టణం గాంధీ నగర్ లో సోమవారం ఏ ఐసీసీ , పి సి సి పిలుపుమేరకు కేంద్రం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక బిల్లును ఉపసంహరిం చుకోవాలని ,తెలంగాణ ప్రభుత్వం రైతులకు సన్నరకం వరి పండించు మని, పండించిన తర్వాత మద్దతు ధర ఇవ్వకపోవడం తో ఎటు పాలు పోలేని పరిస్థితుల్లో ఉన్నారని ముఖ్యమంత్రి కెసిఆర్ సన్నరకం వరి ధాన్యానికి మద్దతు ధర క్వింటాలుకు రూ . 2500ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల చే సంతకాల సేకరణ నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రవ ంలో వేములవాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆది శ్రీనివాస్ వేములవాడ పట్టణ అధ్యక్షులు



సాగరం వెంకటస్వామి నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ సంగ స్వామి యాదవ్ కూరగాయల కొమురయ్య చిలుక రమేష్ మోడిగే చంద్రశేఖర్ కనికరపు రాకేష్ వనపర్తి శంకర్ కొలకని రాజు తంగెళ్ల గణేష్ మరిపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు

# మంచి వర్షంతో పెరిగిన పంటల దిగుబడి

### –కొత్తకోటలో పత్తి కేంద్రం ప్రారంభించిన కొప్పుల

జగిత్యాల,నవంబర్9(ఆర్ఎన్ఎ): గత సంవత్సరంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా మంచి వర్షాలు కురవడంతో వరి, పత్తి పంటల దిగుబడి బాగా పెరిగిందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై ఎవరూ దిగులు చెందవద్దని అన్నారు. జిల్లాలోని కొత్తపేటలో సోమవారం ఆయన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నీటి వనరులు పుష్కలంగా పెరగడంతో వరి,పత్తి పంటలు సమృద్ధిగా పండాయని తెలిపారు. జిల్లాలో సుమారు 17వేల మంది రైతులు పత్తి సాగు చేయగా, 20వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు ఒక అంచనా ఉందన్నారు. చుట్టుపక్కల ఉన్న అన్ని మండలాల రైతులకు అందుబాటులో ఉండేవిధంగా ఈ కొనుగోలు కేంద్రాన్ని కొత్తపేటలో ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. పత్తి రంగు మారకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ, ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా మంత్రి రైతులను కోరారు.

# సాలేహ్ నగర్ ఈద్గా సందర్శించిన ఎంఐఎం నాయకులు



రాజన్న సిరిసిల్లా, నవంబర్ 9 (నేటనిజం ప్రతినిధి):కరీంనగర్ నగర పరిధిలోని 18వ డివిజన్ సాలెహ్ నగర్ లో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్పొరేటర్లు.. నాయకులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. సాలెహ్ నగర్ ఈద్గా వెనుక భాగంలో ఉన్న ఈద్గా భూమిని కొందరు ఆక్రమించారని, ఈద్గా భూమి లో సైడ్ డ్రైనేజి లో మురుగు నీరు వెళ్లడానికి మున్సిపల్ కార్పొరేషన్ వారు సైడ్ డ్రైనేజి నిర్మిస్తున్న విషయమై ఈద్గా ముతవల్లి షేక్ అబూ బకర్ ఖాలీద్ విజ్ఞప్తి మేరకు పరిశీలించారు. ఈద్గా వెనుక భాగంలో కొందరు ఈద్గా భూమిని ఆక్రమించి ప్రహరీ గోడలు నిర్మించారు. అక్రమ నిర్మాణాలు చేసిన ఇండ్ల స్థలాల యజమానులతో ఎంఐఎం నాయకులు గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ నమి మాట్లాడారు.అక్రమించి నిర్మించిన ప్రహరీ గోడను తొలగించాలని కోరారు. ప్రహరీ గోడను తొలగిస్తామని ఇంటి యజమాని చెప్పారు. పవిత్ర ప్రార్థనలు చేసుకునే ఈద్గా భూమిలో ఆనుకొని నిర్మించిన సైడ్ డ్రైనేజిని తొలగించాలని 18వ కార్పొరేటర్ సూదగోని మాధవి–కృష్ణ కు అహ్మద్ హుస్సేన్ విజ్ఞప్తి చేయగా సైడ్ డ్రైన్ తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్ మహమ్మద్ శర్ఫుద్దీన్, నాయకులు ఆతిన, అలిబాబా, సాజిద్, సాలెహ్ నగర్ వివిధ పార్టీల మైనార్టీ నాయకులు డాక్టర్ నిజాముద్దీన్, సయ్యద్ మాజిద్, రహీం, యాఖుబ్, జునేద్, సాధిక్, చాంద్, రఫిక్, తదితరులు ఉన్నారు.

# రైతు వేదిక కేంద్రంగా సమస్యలు చర్చించాలి

### వేదికల ప్రారంభోత్సవంలో మంత్రి సబిత పిలుపు

వికారాబాద్,నవంబర్9(ఆర్ఎన్ఎ): జిల్లాలోని ధారూర్ మండల కేంద్రంలో రైతు వేదికను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించి రైతులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ.. రైతుకు ఏ సమస్య వచ్చిన రైతు వేదికకు రావాలన్నారు. రైతు సంఘటితం అయితేనే రైతులు బాగు పడతారని, తాము పండించిన పంటకు తామే ధర నిర్ణయించే స్థాయికి రైతు ఎదగాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. రూ. 600 కోట్ల తో తెలంగాణ వ్యాప్తంగా 2,604 రైతు వేదికలను స్వల్ప కాలంలో నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. జిల్లాలో 21 కోట్ల 34 లక్షల రూపాయల తో 97 రైతు వేదికల నిర్మాణం పూర్తయిందన్నారు. త్వరగా పూర్తి చేయించడంలో చొరవ చూపిన కలెక్టర్, జిల్లా యంత్రాంగాన్ని ఈ సందర్భంగా అభినందించారు. రైతు బాంధవునిగా ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమం కోసం పాటు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ సునీత రెడ్డి , ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కలెక్టర్ పౌసుమి బసు, అడిషనల్ కలెక్టర్ మోతిలాల్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, జడ్పీటీసీ సుజాత, ఎంపీపీ విజయలక్ష్మి ,సొసైటీ చైర్మన్ సత్యనారా యణ రెడ్డి ,రైతు బంధు అధ్యక్షుడు రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు పాల్గొన్నారు.

# పాత్రికేయునికి కొవ్వొత్తులతో ర్యాలీ




రాజన్న సిరిసిల్లా, నవంబర్ 9 (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండల ఆంధ్రప్రభ రిపోర్టర్ అల్లాడి శేఖర్ ఆదివారం కరోనా తో మృతి చెందగా చందుర్తి ప్రెస్ క్లబ్ ముందు అల్లాడి శేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని చందుర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు గొట్టే మనోహర్, ఎండి అజీమ్, పొంచెట్టి మహేష్, ఏనుగుల కృష్ణ సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాసరావు, నాయకులు లింగాల మల్లయ్య, కుమ్మరి మల్లయ్య, నగేష్, రమేష్ లు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు,

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com